
MAHANAGAR DINAPATRIKA

మహానగర్

విజయవాడ | సంపుటి : 10 | సంచిక : 261 | పేజీలు : 8 | బుధవారం 9 సెప్టెంబర్ 2026 | వెల : 6-00



స్థానికంలో గెలుపు మనదే

- ఎవరైనా పార్టీకి నష్టం కలిగిస్తే సస్పెన్షన్ వేటే
- మద్యం దుకాణాల లైసెన్సుల్ని రెన్యువల్ చేస్తున్నాం
- ఉచిత ఇసుక పక్క రాష్ట్రాలకు వెళ్లకుండా అడ్డుకోవాలి
- తెదేపా లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో సీఎం చంద్రబాబు
- పాతపద్ధతిలో రాజకీయం చేస్తామంటే కుదరదు
- మద్యం ఎమ్మార్పీకి మించి అమ్మితే కఠిన చర్యలే

అమరావతి, మహానగర్

స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీల అభ్యర్థులే అన్ని స్థానాల్లో గెలవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు తెదేపా నేతలకు కర్తవ్యబోధ చేశారు. ఎక్కడైనా పార్టీకి నష్టం కలిగించే ప్రయత్నం చేస్తే సస్పెన్షన్ వేటేస్తామని హెచ్చరించారు. స్థానిక ఎన్నికలపై దింపుడు కళ్లం ఆశలతోనే వైకాపా.. సర్, బీసీ రిజర్వేషన్లపైన కోర్టుకెళ్లిందని విమర్శించారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో చంద్రబాబు స్థానిక సంస్థల ఎన్నికలపై పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. 'నగరపాలక సంస్థల మేయర్లు, పురపాలక సంఘాల ఛైర్మన్లను ప్రత్యక్ష విధానంలో ఎన్నుకునే విధానం తెచ్చాం. కూటమిగా సాగుతూ.. గెలుపే ధ్యేయంగా పనిచేయాలి. ప్రతి చోటా ఉత్తమ అభ్యర్థుల్ని పోటీకి నిలబెట్టేలా జాగ్రత్తలు తీసుకోవాలి. పార్టీకి, ప్రభుత్వానికి చెడ్డపేరు రాకుండా అభ్యర్థుల ఎంపిక జరగాలి' అని సూచించారు. చంద్రబాబు ప్రసంగంలో ముఖ్యాంశాలివీ.. పాత పద్ధతుల్లోనే రాజకీయం చేస్తామంటే వేగం అందుకోలేరు. చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లి పాజిటివ్ స్ఫూర్తిని ఓటుబ్యాంకుగా మార్చుకోవాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలపై ఉంది. నియోజకవర్గాల్లో దీర్ఘకాలిక సమస్యల్ని పూనుకుని పరిష్కరిస్తే ఎమ్మెల్యేల ఇమేజ్ పెరుగుతుంది. ఇప్పటిదాకా ఓటేసే అలవాటు లేని వారిని మనకు అనుకూలంగా మార్చుకుందాం. జెన్‌జీ దూకుడుగా ఉంది. వారి ఆలోచనల్ని పరిగణనలోకి తీసుకోవాలి. రాజకీయనేత వీలైనన్నిసార్లు ప్రజల దగ్గరకు వెళ్లాలి. మై టీడీపీ యాప్‌ను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలి. అభివృద్ధి– సంక్షేమాన్ని సోషల్ మీడియా ద్వారా, క్షేతస్థాయి పర్యటన ప్రజలందరికీ చేరువచేయాలి. పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాలకు విస్తృత ప్రచారం కల్పించాలి. ఏడాదికి రూ.1,000 కోట్ల ఆదాయం వదులుకుని ప్రజలకు ఉచిత ఇసుక ఇస్తున్నాం. దాన్ని ఎక్కడైనా ఇతర రాష్ట్రాలకు తరలిస్తుంటే అడ్డుకోవాలి. మద్యం టెండర్లు ముగుస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న దుకాణాల లైసెన్సుల్ని రెన్యువల్ చేస్తాం. ఎమ్మార్పీ కంటే రూపాయి ఎక్కువ - మిగతా2లో



నా వడోదరా అద్భుతం

- ప్రధాని మోదీ భావోద్వేగం
- వడోదరా ప్రజలు చేపట్టిన స్వచ్ఛతా కార్యక్రమంపై ప్రధాని ప్రశంసలు
- అలకపాన్పు ఎక్కిన మేనమామకు ఇప్పుడు పని దొరికింది
- విపక్షాలపై మోదీ సెటైర్లు
- వడోదరలో రూ.35 వేల కోట్లకుపైగా ప్రాజెక్టులకు శ్రీకారం
- 2,800 కి.మీ. డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ పూర్తి
- 250కుపైగా ట్రక్కుల సరుకును ఒకే రైలులో తరలించిన ఘనత
- స్వచ్ఛతను పండగల స్ఫూర్తితో కొనసాగించాలని ప్రజలకు పిలుపు

వాయు కాలుష్యంపై కేంద్రం సర్వే



- లక్నో టాప్, హైదరాబాద్ 19, విశాఖ 21
- స్వచ్ఛ వాయు సర్వేక్షణ్ 2026 ర్యాంకుల్లో లక్నోకు అగ్రస్థానం
- 10 లక్షల జనాభా నగరాల కేటగిరీలో ఢిల్లీకి 21వ ర్యాంక్
- విశాఖతో కలిసి 21వ ర్యాంక్ పంచుకున్న దేశ రాజధాని నగరం
- గాలి నాణ్యతతో కాకుండా కాలుష్య నియంత్రణ చర్యల ఆధారంగా ఈ ర్యాంకులు
- హైదరాబాద్‌కు 19వ స్థానం, ముంబైకి 28వ ర్యాంక్

బ్రిక్స్ సదస్సు వేళ ప్రధాని మోదీ, పుతిన్ భేటీ

5



- ద్వైపాక్షిక వాణిజ్యం, రక్షణ, ఆర్థిక సహకారంపై చర్చ!
- సెప్టెంబర్ 11న భేటీ కానున్న మోదీ, పుతిన్
- అజెండాలో ఎస్‌యూ-57 విమానాల డీల్
- వెల్లడించిన క్రెమ్లిన్ అధికార ప్రతినిధి

సాగునీటి కోసం పోరుబాట



- పోలీసులు అడ్డుకోవడంతో నెల్లూరు బ్యారేజీపై బైఠాయించిన వైఎస్సార్‌సీపీ నేతలు, రైతులు
- శ్రీశైలం జలాలు విడుదల చేయాలంటూ వైఎస్సార్‌సీపీ 'చలో నెల్లూరు బ్యారేజీ'
- నేతలను, రైతులను అడ్డుకునేందుకు పోలీసులను ప్రయోగించిన బాబు సర్కారు
- బ్యారేజీ వద్దకు వెళ్లకుండా బారికేడ్లు పెట్టి ఆంక్షలు
- రోప్ పార్టీలను రంగంలోకి దింపి రైతులు, వైఎస్సార్‌సీపీ నేతలపై దౌర్జన్యం

అమరావతి, మహానగర్

శ్రీశైలం జలాలు సోమశిలుకు విడుదల చేయాలనే డిమాండ్‌తో నెల్లూరు జిల్లా రైతులతో కలిసి వైఎస్సార్‌సీపీ మంగళవారం పోరుబాట పట్టింది. వైఎస్సార్‌సీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ టాస్క్ ఫోర్స్ కో--ఆర్డినేటర్ సాకే శైలజానాథ్ నేతృత్వంలో మంగళవారం 'చలో నెల్లూరు బ్యారేజీ' కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు చంద్రబాబు ప్రభుత్వం పోలీసులను ప్రయోగించింది. వైఎస్సార్‌సీపీ నేతలు, రైతులను బ్యారేజీ వద్దకు వెళ్లకుండా పోలీసులు అడుగడుగునా ఆటంకాలు కల్పిం చారు. బారికేడ్లు పెట్టి మరీ ఆంక్షలు విధించారు. రోప్ - మిగతా2లో

అరాచకాలను అరికట్టేందుకు హోం శాఖ ఏం చేస్తోంది?

- ఢిల్లీలో మణిపురి సంగీతకారుడి కొట్టిచంపిన ఘటనపై రాహుల్‌గాంధీ స్పందన
- ఈశాన్య రాష్ట్రాల ప్రజలకు ఢిల్లీలో భద్రత ఉందా అంటూ ప్రశ్న
- కేంద్ర హోంమంత్రిత్వ శాఖ, ఢిల్లీ పోలీసుల తీరుపై విమర్శలు

5



వచ్చే ఏడాదే బుల్లెట్ రైలు పరుగులు

- రైల్వే మంత్రి కీలక ప్రకటన
- వచ్చే ఏడాది మే, జూన్‌లో బుల్లెట్ రైలు ట్రయల్స్
- 2 నుంచి 4 నెలల తర్వాత అధికారికంగా ప్రారంభం
- తొలి బాడీ ఫ్రేమ్ ఇప్పటికే సిద్ధమైందన్న అశ్వినీ వైష్ణవ్
- సూరత్-వాపి మార్గం డిసెంబరులో పూర్తయ్యే అవకాశం
- గంటన్నరలో ముంబై నుంచి వడోదరకు

ఇది తెలుగుదేశం పార్టీ 3.0 వెర్షన్



అమరావతి, మహానగర్

కార్యకర్తల పోరాటం, త్యాగాల వల్లే అధికారంలోకి వచ్చామని అందరూ గుర్తుంచుకోవాలని తెదేపా వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్ అన్నారు. పార్టీ, పర్సనల్, ప్రభుత్వం అనే మూడు 'పీ'లను అందరూ విధిగా పాటించాలని, వ్యక్తిగతంగా ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉండాలని సూచించారు. 'కష్టపడి పనిచేసే కార్యకర్తలను గుర్తించాల్సిన బాధ్యత మనపై ఉంది. మన సైన్యం సరిగా ఉంటేనే యుద్ధంలో గెలుస్తాం. పార్టీకి దూరంగా ఉన్నవారిని గుర్తించి దగ్గరికి తీసుకోవాలి. ఎన్నికల్లో ప్రభావితం చేయగలిగిన - మిగతా2లో

- కార్యకర్తల పోరాటం, త్యాగం వల్లే అధికారం
- తెదేపా లీడర్‌షిప్ కాంక్లేవ్ ముగింపు సభలో నారా లోకేశ్
- చంద్రబాబు అక్రమ అరెస్టుకు నేటితో మూడేళ్లు
- 'నిజం గెలిచింది' పేరుతో రాష్ట్రవ్యాప్త కార్యక్రమానికి పిలుపు
- కాంక్లేవ్‌లో మహిళా నేతలతో నారా లోకేశ్

స్థానికంలో గెలుపు మనదే

-మొదటిపేజీ తరువాయి

అమ్మినా కఠినంగా వ్యవహరిస్తాం. నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలే దీనికి బాధ్యత తీసుకోవాలి.

ఎల్‌నినోను సమర్థంగా ఎదుర్కొందాం

ఎల్‌నినోను సమర్థంగా ఎదుర్కొందాం. రాష్ట్రంలో ఇప్పటికి 54 శాతం లోటు వర్షపాతం నమోదైంది. రిజర్వాయర్లలో గతేడాది 737 టీఎంసీల నీరుంటే.. ఈ ఏడాది 530 టీఎంసీలే ఉంది. భూగర్భ జలాలు తగ్గుతున్నాయి. నెల్లూరు జిల్లాలో 177%, తిరుపతి జిల్లాలో 158%, కోనసీమలో 103%, పశ్చిమ గోదావరి 99 శాతం పంటలు వేశారు. అతి తక్కువగా మార్కాపురం జిల్లాలో 21, పోలవరంలో 20, ప్రకాశం జిల్లాలో 12 శాతం మాత్రమే పంటలు వేశారు. గోదావరి నీటిని తరలించి కృష్ణా డెల్టాలో పంటల్ని కాపాడాం. పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా 36 టీఎంసీల నీరు ప్రకాశం బ్యారేజీకి తరలించాం. ఈ సీజన్‌కు మరో 71 టీఎంసీలు కావాలి. తాగునీటికే మొదటి ప్రాధాన్యం. పశువులకు కూడా నీటి కొరత లేకుండా కాపాడుకుంటాం. పరిశ్రమలకు కూడా లోటు లేకుండా చూసేలా కార్యాచరణ చేపడతాం. ఉద్యాన పంటలు కాపాడేందుకు చర్యలు చేపట్టాం. పంటల బీమా పెద్దఎత్తున చేశాం. 14,900 ఎకరాల్లో పంటలు పూర్తిగా ఎండిపోయాయి. కర్నూలు, నంద్యాల తదితర ప్రాంతాల్లో పంటలు వేసిన రైతులు పూర్తిగా నష్టపోయారు. వంశధార, గోదావరి, కృష్ణ, తుంగభద్ర, కావేరి, పెన్న.. ఆరు నదుల్ని అనుసంధానం చేస్తాం. రాష్ట్రంలో 1,200 నుంచి 1,400 టీఎంసీలు నిల్వ చేసుకోగలిగితే నీటి సమస్య ఉండదు. భూమినే జలాశయంగా మార్చాలి.

జీఎస్‌డీపీలో విజయవాడ సెంట్రల్,పాలకొల్లు, మండపేట ముందంజ

15-20 రంగాల్లో జీఎస్‌డీపీని పెంచేలా నియోజకవర్గాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలి. నియోజకవర్గ జీఎస్‌డీపీలో విజయవాడ సెంట్రల్, పాలకొల్లు, మండపేట, చిలకలూరిపేట, నెల్లూరు సిటీ, తణుకు ముందున్నాయి. పౌరసేవల్లో అన్ని నియోజకవర్గాలూ పోటీపడాలి.

గొడ్డలి పార్టీ దుష్ప్రచారాన్ని ఉపేక్షించవద్దు

గొడ్డలి పార్టీకి చెందిన మీడియా.. కుప్పం వెళ్లి ఉపాధ్యాయుల్ని బెదిరించే స్థాయికి చేరింది. ఆ పార్టీ దుష్ప్రచారాన్ని ఉపేక్షించవద్దు. తెదేపా, కూటమి పార్టీ నేతల్ని ప్రత్యర్థులు విమర్శిస్తే.. బృంద స్ఫూర్తితో తిప్పికొట్టాలి. ఫేక్ ప్రచారం మీదే ఆధారపడి గొడ్డలి పార్టీ రాజకీయం చేస్తోంది. మద్యం కుంభకోణం, వివేకా హత్య, ఏపీపీఎస్సీ అక్రమాలపై ఆ పార్టీ నోరెత్తదు.

నేడు కోనసీమ జిల్లాలో సీఎం చంద్రబాబు పర్యటన

అంబాజీపేట, న్యూస్‌టుడే: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేటలో ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం పర్యటించనున్నారు. తొలుత పండువారిపేట వద్ద ఏర్పాటు చేసిన గ్రామసభలో వివిధ స్టాల్స్‌ను పరిశీలించి, రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేసి ప్రసంగిస్తారు. జయంతినగర్ సమీపంలో రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారు. పి.గన్నవరం నియోజకవర్గం తెదేపా కార్యకర్తలతో సీఎం సమావేశమై వివిధ అంశాలపై చర్చిస్తారు. రెవెన్యూశాఖ చీఫ్ సెక్రటరీ జయలక్ష్మి, ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్, కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, ఎస్పీ రాహుల్ మీనా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

సాగునీటి కోసం పోరుబాట

-మొదటిపేజీ తరువాయి

పార్టీలను రంగంలోకి దింపి రైతులు, వైఎస్సార్‌సీపీ నేతలపై దౌర్జన్యం చేశారు.

ఎస్పీకి ముందుగానే సమాచారమిచ్చినా..

ఈ కార్యక్రమంపై ముందుగానే జిల్లా ఎస్పీకి వైఎస్సార్‌సీపీ నేతలు సమాచారమిచ్చినప్పటికీ అడ్డుకునేందుకు పోలీసులు యత్నించారు. తొలుత మాజీ మంత్రులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, సాకే శైలజానాథ్, వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ ఇన్‌చార్జి ఆనం విజయ్‌కుమార్‌రెడ్డి, గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త బుదూరు గురవయ్య, సర్వేపల్లి నియోజకవర్గ పరిశీలకుడు వీరి చలపతి, రైతు విభాగం అధ్యక్షుడు శివుని నరసింహారెడ్డి తదితరులతో కలిసి రైతులు, పార్టీ నాయకులు వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయం నుంచి సుమారు 100 కార్లు, బైకులతో భారీ ర్యాలీగా నెల్లూరు బ్యారేజీ వైపు తరలివచ్చారు. అప్పటికే బ్యారేజీ వద్ద భారీగా మోహరించిన పోలీసులు వారిని అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. రోప్ పార్టీలతో వైఎస్సార్‌సీపీ శ్రేణులను ముందుకు వెళ్లనివ్వకుండా పోలీసులు అడ్డుకున్నారు. ఉదయం నుంచి బ్యారేజీ రెండువైపుల బారికేడ్లు పెట్టి ప్రజలను సైతం రాకపోకలు సాగించకుండా నిలువరించారు. దీంతో దాదాపు గంటపాటు పోలీసులు, పార్టీ నేతల మధ్య తోపులాటలు జరిగాయి. అనంతరం రైతులు, నాయకులతో కలిసి రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. చివరకు పోలీసుల అడ్డంకులను లెక్కచేయకుండా బ్యారేజీ వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు.



చంద్రబాబు నిర్లక్ష్యంతోనే శాశ్వత కరువు: కాకాణి

చంద్రబాబు నిర్లక్ష్యంతోనే గ్రేటర్ రాయలసీమ శాశ్వత కరువు కోరల్లోకి వెళ్లిపోతోందని కాకాణి గోవర్ధన్‌రెడ్డి మండిపడ్డారు. స్వప్రయోజనాల కోసమే శ్రీశైలం జలాలను తెలంగాణకు తాకట్టు పెట్టారని దుయ్యబట్టారు. పంటలు ఎండిపోతున్నా కూటమి ప్రభుత్వం శ్రీశైలం దిగువ ప్రాజెక్ట్‌లకు నీటిని విడుదల చేయడంలో ఎందుకు మీనమేషాలు లెక్కిస్తోందని నిలదీశారు. శ్రీశైలంలో నీళ్లున్నా సోమశిలకు ఎందుకు విడుదల చేయడం లేదని ప్రశ్నించారు. నీటిమట్టం మరింత పడిపోతే నెల్లూరు జిల్లాకు శాశ్వత కరువు ముప్పు ఏర్పడుతుందన్నారు.

సోమశిల--కండలేరు ఫ్లడ్‌ఫ్లో కెనాల్ ద్వారా ఒక్క రోజు నీటిని విడుదల చేసినా కలువాయి, కుల్లూరు చెరువులకు నీరు చేరుతుందన్నారు. ఇప్పటికే కలువాయి మండలం కనుపూరుపల్లి, నూకనపల్లి, యదనపర్తి, వెఱుట్లపల్లి, గోపవరం తదితర గ్రామాల్లో 3,600 నుంచి 4,000 ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయన్నారు. రైతులు పురుగు మందు డబ్బాలు చేతపట్టుకుని రోడ్డెక్కుతున్నా ప్రభుత్వానికి కనికరం లేదన్నారు. రైతుల పోరాటాల్ని అడ్డుకుని ప్రభుత్వ వైఫల్యాలను దాచలేరని మండిపడ్డారు.

ఎల్‌నినో కాదు.. ఎల్లో నిల్ ఎఫెక్ట్: శైలజానాథ్

మాజీ మంత్రి సాకే శైలజానాథ్ మాట్లాడుతూ.. ఇది ఎల్‌నినో ఎఫెక్ట్ కాదని.. ఎల్లో నిల్ ఎఫెక్ట్ అని ఎద్దేవా చేశారు. నెల్లూరు జిల్లా రైతుల్ని కూటమి ప్రభుత్వం నట్టేట ముంచుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సోమశిల ప్రాజెక్టుకు శ్రీశైలం నుంచి తక్షణమే నీటిని తరలించి ఎండిపోతున్న పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. పది రోజులుగా శ్రీశైలం నుంచి సోమశిలకు నీటిని తరలించాలని కోరుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. శ్రీశైలం నుంచి సోమశిలకు చుక్క నీరు కూడా ఇవ్వబోమని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించడం దారుణమన్నారు. శ్రీశైలం నుంచి నీటిని విడుదల చేసే వరకు ఈ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

ఇది తెలుగుదేశం పార్టీ 3.0 వెర్షన్



-మొదటిపేజీ తరువాయి

వారిని గుర్తించాలి. కార్యకర్తలకు చేయగలిగే పనులు చేయాలి. నియోజకవర్గంలో ఏ చిన్న సమస్య అయినా సీరియస్‌గా తీసుకోవాలి' అని సూచించారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన లీడర్‌షిప్ కాంక్లేవ్ ముగింపు సభలో ఆయన మాట్లాడారు. ఆయన ఇంకా ఏమన్నారంటే.. ఇది తెలుగుదేశం పార్టీ 3.0 వెర్షన్. పార్టీ ఒక్కసారి నిర్ణయం తీసుకున్న తర్వాత అందరూ తు.చ. తప్పకుండా పాటించాలి. నేను ఏనాడూ లక్ష్మణరేఖ దాటలేదు. అహంకారం వద్దు, సింప్లిసిటీ పాటించాలి. డీఎస్సీలో మనం ఏ తప్పూ చేయలేదు. జగన్ ఏనాడు బాబాయి హత్య, ఏపీపీఎస్సీ, దస్తగిరి, లిక్కర్ స్కామ్ గురించి మాట్లాడలేదు. ఇప్పుడు డీఎస్సీ గురించి మాట్లాడుతున్నారు. మనం 16 వేల టీచర్ పోస్టులు భర్తీ చేశాం.వైకాపా హయాంలో ఇచ్చింది సున్నా. ఐదేళ్లలో మనం 30 వేల టీచర్ పోస్టులు భర్తీ చేస్తాం. కాకినాడలో పోలీస్ రిక్రూట్‌మెంట్ గురించి ఆందోళన జరిగింది. వైకాపా హయాంలో ఇచ్చింది సున్నా. మనం 6 వేల కానిస్టేబుల్ పోస్టులు భర్తీ చేశాం. ఈ ఐదేళ్లలో 10 వేల పోస్టులు భర్తీ చేస్తాం.

మూడు నెలలకొకసారి కాంక్లేవ్

నాయకులకు శిక్షణ ఇచ్చేందుకే ఈ కాంక్లేవ్ పెట్టాం. ఇకపై మూడు నెలలకోసారి కాంక్లేవ్ నిర్వహిస్తాం. రాష్ట్రస్థాయిలో మిమ్మల్ని నాయకులుగా గుర్తించే ఈ సమావేశానికి ఆహ్వానించాం. ఎన్నికల్లో తిరిగి గెలవాలంటే మన బలహీనతల్ని గుర్తించి అధిగమించాలి.

ప్రధాని మోదీ నుంచి నేర్చుకున్నా

'నాయకులుగా మనం ముందు వినగలగాలి. దీనిని నేను ప్రధాని మోదీ నుంచి నేర్చుకున్నా. ఒక ప్రధానిగా ఉండి ఆయన నా నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుంటారు. మనం కూడా ఫీడ్ బ్యాక్ తీసుకుని మనల్ని మనం మార్చుకోవాలి. ప్రజలు సింప్లిసిటీ కోరుకుంటున్నారు. గ్రామాలకు వెళ్లినప్పుడు అందరినీ కలవాలి. చంద్రబాబును అక్రమంగా అరెస్ట్ చేసి బుధవారానికి మూడేళ్లు. అర్ధరాత్రి అరెస్ట్ చేసి రోడ్డు మార్గంలో కోర్టుకు తీసుకెళ్లారు. 53 రోజులపాటు జైల్లో బంధించారు. చంద్రబాబుకు కోర్టు, ఈడీ క్లీన్ చిట్ ఇచ్చాయి. 'నిజం గెలిచింది' పేరుతో బుధవారం రాష్ట్రవ్యాప్తంగా పార్టీ కార్యాలయాలు, ఇళ్లు, బూత్ స్థాయిలో 53 దీపాలు వెలిగిద్దాం. బ్లాక్ డేగా పాటిద్దాం.

వినాయక మండపాల్లో విద్యుత్ భద్రతా ప్రమాణాలు పాటించాలి

గణేష్ మండపాలకు తాత్కాలిక విద్యుత్ సరఫరా

500 వాట్లకు రూ.1,000.. వెయ్యి వాట్లకు రూ.2,250

విజయవాడ, మహానగర్



వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసే గణేష్ మండపాల్లో విద్యుత్ భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి. పుల్లారెడ్డి సూచించారు. మండపాలను విద్యుత్ స్తంభాలు, తీగలకు దూరంగా ఏర్పాటు చేయాలని, వాటిపైనుంచి విద్యుత్ తీగలు వెళ్లకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ అలంకరణలకు నాణ్యమైన వైర్లు, స్విచ్‌లు, ప్లగ్‌లు వినియోగించాలని, వైరింగ్ పనులను అర్హత కలిగిన ఎలక్ట్రీషియన్లతోనే చేయించాలని సూచించారు. అధిక లోడ్ వల్ల ప్రమాదాలు జరగకుండా తగిన సామర్థ్యం కలిగిన వైరింగ్, రక్షణ పరికరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వర్షాల సమయంలో విద్యుత్ పరికరాలు, వైర్లు తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, తడిసిన పరికరాలను చేతితో తాకరాదని హెచ్చరించారు. విద్యుత్ తీగలు తెగిపడినా, వేలాడుతున్నా వాటికి దూరంగా ఉండి వెంటనే విద్యుత్ శాఖకు లేదా 1912 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. మండపాల వద్ద అలంకరణల కారణంగా ప్రజల రాకపోకలు, అత్యవసర వాహనాలకు ఆటంకం కలగకుండా చూడాలని సూచించారు. ఈ నెల 26వ తేదీ వరకు గణేష్ మండపాలకు తాత్కాలిక విద్యుత్ సరఫరా అందించనున్నట్లు సీఎండీ తెలిపారు. 500 వాట్లకు రూ.1,000, 1,000 వాట్లకు రూ.2,250 చొప్పున రుసుము ఉంటుందని, దరఖాస్తు రుసుము రూ.100గా నిర్ణయించినట్లు వెల్లడించారు. స్వర్ణ గ్రామ/వార్డు సచివాలయాలు, ఏపీసీపీడీసీఎల్ వెబ్‌సైట్, మీ-సేవ కేంద్రాల ద్వారా తాత్కాలిక విద్యుత్ కనెక్షన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. మండపాల నిర్వాహకులు అనధికారికంగా విద్యుత్ కనెక్షన్లు తీసుకోవడం లేదా అక్రమంగా విద్యుత్ వినియోగించడం చేస్తే నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని పుల్లారెడ్డి హెచ్చరించారు. భక్తిశ్రద్ధలతో పాటు విద్యుత్ భద్రతా ప్రమాణాలు పాటిస్తూ వినాయక చవితిని సురక్షితంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

విజయవాడ అభివృద్ధికి ఎంపీ కేశినేని చిన్ని చొరవ

విజయవాడ, మహానగర్



పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఎంపీ లాడ్స్ ద్వారా 18వ లోక్‌సభ కాలానికి నియోజకవర్గానికి కేటాయించిన రూ.15 కోట్లలో రూ.5,83,54,032 విలువైన పనులకు ఇప్పటికే సిఫార్సులు చేయగా, రూ.8,86,45,968 నిధులు అందుబాటులో ఉన్నట్లు ఎంపీ కార్యాలయం వెల్లడించింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీరు, డ్రైనేజీ, కమ్యూనిటీ హాళ్లు, రహదారులు, కల్వర్టులు, సాగునీటి సదుపాయాలు, శ్మశానవాటికల అభివృద్ధి వంటి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నారు. 2025--26లో మంజూరైన పలు పనులు పూర్తికాగా, మరికొన్ని పురోగతిలో ఉన్నాయి. 2026--27లోనూ స్థానిక అవసరాలకు అనుగుణంగా కొత్త పనులను ప్రతిపాదించారు. వీటిలో జగ్గయ్యపేట మండలం వేదాద్రి వద్ద కృష్ణానదిపై ఎత్తిపోతల సాగునీటి పథకానికి 2,300 హెచ్‌పీ పంప్‌సెట్ ఏర్పాటు, నందిగామ మండలం రాఘవాపురంలోని కమ్మవారిపాలెం వద్ద మంగళవాగుపై కల్వర్టు, రిటైనింగ్ వాల్ నిర్మాణం, విజయవాడలోని 31వ, 60వ డివిజన్లలో కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం, 11వ డివిజన్ పీ అండ్ టీ కాలనీ నుంచి గురునానక్ కాలనీ వరకు పైప్‌లైన్ ఏర్పాటు, ఆటోనగర్ ఈఎల్ఎస్ఆర్ నుంచి గురునానక్ కాలనీ రోడ్డు వరకు పైప్‌లైన్, మునగచెర్లలో గ్రావిటీ మెయిన్ పైప్‌లైన్, 40 కేఎల్ సంప్ ఏర్పాటు తదితర పనులు ఉన్నాయి. తిరువూరు 17వ వార్డులో కమ్యూనిటీ హాల్ అభివృద్ధి, ఎ.కొండూరు మండలం గొల్లమండలలో మామిళ్లవాగుపై పైప్ కల్వర్టుల నిర్మాణం, బెజవాడ బార్ అసోసియేషన్ సిటీ సివిల్ కోర్టు కాంప్లెక్స్‌లో మహిళా బార్ అసోసియేషన్ భవన నిర్మాణం, జగ్గయ్యపేట మండలం బాలుసుపాడు గ్రామంలో కమ్యూనిటీ హాల్, మల్కాపురం ఎస్సీ శ్మశానవాటిక అభివృద్ధి పనులు కూడా ప్రతిపాదనల్లో ఉన్నాయి. అలాగే పెనుగంచిప్రోలు ఎస్సీ ప్రాంతంలో కమ్యూనిటీ హాల్, అనిగండ్లపాడు ఎస్సీ కాలనీలో స్లాబ్ కల్వర్టు, నందిగామ మండలం మగల్లు గ్రామంలోని ఎస్సీ శ్మశానవాటికకు ప్రహరీ, వత్సవాయి మండలం మక్కపేటలో సీసీ డ్రెయిన్, కల్వర్టు నిర్మాణ పనులను ప్రతిపాదించారు. ప్రజా ధనంతో చేపడుతున్న ప్రతి పనిని నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులతో ఎంపీ సమన్వయం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ చిన్ని మాట్లాడుతూ విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గంలోని ప్రతి ప్రాంతానికి సమాన ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరచడమే లక్ష్యమన్నారు. ప్రజల స్థానిక సమస్యలు, అవసరాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, అందుబాటులో ఉన్న ఎంపీ లాడ్స్ నిధులతో సాధ్యమైన మేరకు అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. నియోజకవర్గాన్ని మెరుగైన మౌలిక వసతులు కలిగిన ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు.

సింహపురిలో రియల్ జోరు

నెల్లూరు

నెల్లూరు నగరంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం కొత్త దారిలో వెళ్తోంది. నగర పరిధిలోని కీలకమైన మినీ బైపాస్ రోడ్డు, కృష్ణపట్నం పోర్ట్ కనెక్టివిటీ రహదారుల పొడవునా సెమి-లగ్జరీ అపార్ట్‌మెంట్లు, ఆధునిక కమర్షియల్ కాంప్లెక్స్‌ల నిర్మాణాలు భారీగా పుంజుకున్నాయి. జాతీయ రహదారి కి, పోర్ట్ రవాణా కారిడార్‌కు అనుసంధానంగా ఉన్న ఈ ప్రాంతాలు నివాస , వ్యాపార అవసరాలకు అనువుగా మారడంతో డెవలపర్లు సరికొత్త ప్రాజెక్టులతో ముందుకు వస్తున్నారు.కృష్ణపట్నం పోర్ట్ ఆధారిత లాజిస్టిక్స్, షిప్పింగ్ సంస్థలు, మైనింగ్ , మల్టీ-మోడల్ ట్రాన్స్‌పోర్ట్ రంగాలు శరవేగంగా విస్తరిస్తుండటంతో నెల్లూరు నగరంలో ఆయా కంపెనీల అధికారులు, ఇంజనీర్ల నివాస అవసరాలు పెరిగాయి. దీనికి తోడు మెరుగైన అద్దె ఆదాయం వస్తుండటంతో విదేశాల్లో ఉండే నెల్లూరు జిల్లావాసులు తమ పెట్టుబడులను మినీ బైపాస్ పరిసరాల్లోని సెమి-లగ్జరీ ఫ్లాట్లు, కమర్షియల్ ప్రాపర్టీలపై కేంద్రీకరిస్తున్నారు. సేఫ్ ఇన్వెస్ట్‌మెంట్‌గా భావిస్తూ ముందస్తుగానే అపార్ట్‌మెంట్లను బుక్ చేసుకుంటున్నారు.మినీ బైపాస్ పరిసర ప్రాంతాలు నగరంలోని ప్రధాన ఆసుపత్రులు, విద్యాసంస్థలు, షాపింగ్ మాల్స్‌కు సమీపంలో ఉండటం కూడా కొనుగోలుదారులను విశేషంగా ఆకట్టుకుంటోంది. గతంలో కేవలం ఇండిపెండెంట్ ఇళ్లకు ప్రాధాన్యత ఇచ్చిన స్థానికులు, ఇప్పుడు సెక్యూరిటీ, పవర్ బ్యాకప్, జిమ్, కార్ పార్కింగ్ వంటి వసతులు ఉండే గేటెడ్ కమ్యూనిటీల వైపు మొగ్గు చూపుతున్నారు. దీనివల్ల ఇక్కడ చదరపు అడుగు ధర రూ. 4,000 నుంచి రూ. 6,000 వరకు పలుకుతోంది.పరిశ్రమల అభివృద్ధి, పోర్ట్ ఆధారిత వ్యాపారాల విస్తరణతో నెల్లూరు నగరం దక్షిణ కోస్తాలో కీలకమైన లాజిస్టిక్స్ హబ్‌గా రూపాంతరం చెందుతోంది.

పరిశుభ్రమైన పరిసరాలతో ఆరోగ్యకర సమాజ నిర్మాణం





స్వచ్ఛ గ్రామాలతోనే స్వర్ణాంధ్ర సాధ్యం
ప్లాస్టిక్‌కు దూరంగా.. పరిశుభ్రతకు చేరువగా ముందడుగు వేయాలి
జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

ఇబ్రహీంపట్నం, మహానగర్

స్వచ్ఛమైన గ్రామాల నిర్మాణంతోనే స్వర్ణాంధ్ర లక్ష్యం సాకారమవుతుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను సామాజిక బాధ్యతగా భావించి భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మండల పరిధిలోని జూపూడి గ్రామంలో మంగళవారం జిల్లా పంచాయతీ కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. గ్రామంలో నిర్వహించిన స్వచ్ఛతా ర్యాలీలో ప్రజలు, అధికారులు, సిబ్బందితో కలిసి నడిచారు. ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించాలని, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, చెత్తను సక్రమంగా నిర్వహించాలని సందేశాలు ఇచ్చే ప్లకార్డులను ప్రదర్శించారు. గ్రామంలో ఉత్పత్తయ్యే చెత్తను సక్రమంగా వేరు చేసి నిర్వహించడం ద్వారా చెత్త నుంచి సంపదను సృష్టించవచ్చని కలెక్టర్ తెలిపారు. చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాన్ని సందర్శించి అక్కడ మొక్కలు నాటారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, వ్యర్థాల సేకరణ, వేరు చేయడం, పునర్వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఇంటి నుంచే చెత్తను వేరు చేయడం ద్వారా పారిశుద్ధ్య నిర్వహణ మరింత సమర్థవంతంగా మారుతుందన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్లాస్టిక్ కవర్లకు బదులుగా జ్యూట్, క్లాత్ బ్యాగుల వంటి పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను వినియోగించాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం ప్రతి పౌరుడి బాధ్యతగా గుర్తించి, గ్రామాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. పరిశుభ్రత కేవలం ప్రభుత్వ శాఖల బాధ్యత కాదని, ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛమైన గ్రామాలను నిర్మించగలమని కలెక్టర్ పేర్కొన్నారు. ఇంటి పరిశుభ్రత నుంచి గ్రామ పరిశుభ్రత, గ్రామ పరిశుభ్రత నుంచి ఆరోగ్యకరమైన సమాజం, ఆరోగ్యకరమైన సమాజం నుంచి స్వర్ణాంధ్ర దిశగా ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీపీవో టి.సీతామహాలక్ష్మి, ఎంపీడీవో శకుంతల, డీఎల్‌పీవో రాఘవన్, డిప్యూటీ ఎంపీడీవో మనోజ్, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

రైజ్ నుంచి రైజింగ్ ఏఐ స్టార్స్





సత్తాచాటిన స్వయం సహాయక సంఘాల మహిళలు
శిక్షణ పూర్తిచేసుకున్న ఏఐ 4 అష్యూర్ తొలి బ్యాచ్
31 మందిలో కొందరికి ఫుల్‌టైమ్ ఉద్యోగ అవకాశాలు..
మిగిలిన వారికి వర్క్ ఫ్రమ్ హోమ్, ఫ్రీలాన్స్ ఉపాధి
సర్టిఫికెట్లు, ఆఫర్ లెటర్లు అందజేసిన జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

ఇబ్రహీంపట్నం, మహానగర్

గ్రామీణ స్వయం సహాయక సంఘాల మహిళల్లోని ప్రతిభకు ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను జోడించి, వారిని విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో గుంటుపల్లిలోని రైజ్ కేంద్రంలో ఏఐ 4 అష్యూర్ కార్యక్రమాన్ని ప్రారంభించామని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ4 స్ఫూర్తితో సింటిల్లా డిజిటల్ అకాడమీ సీఈవో కె.సతీష్‌కుమార్ సహకారంతో నిర్వహించిన 45 రోజుల శిక్షణను తొలి బ్యాచ్‌లో 31 మంది మహిళలు విజయవంతంగా పూర్తిచేశారు. మండల పరిధిలోని గుంటుపల్లి రైజ్ కేంద్రంలో మంగళవాం నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ వారికి సర్టిఫికెట్లు, ఆఫర్ లెటర్లు అందజేశారు. ఆన్‌లైన్‌తోపాటు హైదరాబాద్‌లో ఆఫ్‌లైన్ శిక్షణ పొందిన వారిలో నలుగురికి సినిమాటిక్ ఏఐ విభాగంలో హైదరాబాద్‌లో ఫుల్‌టైమ్ ఉద్యోగాలు లభించగా, మిగిలిన వారికి ఫ్రీలాన్స్, వర్క్ ఫ్రమ్ హోమ్ అవకాశాలు లభించాయని తెలిపారు. ఏఐ వంటి ఆధునిక సాంకేతిక రంగాల్లో మహిళలు సాధిస్తున్న పురోగతిని కలెక్టర్ అభినందించారు. 'ఒక కుటుంబం--ఒక పారిశ్రామికవేత్త' లక్ష్యానికి అనుగుణంగా మహిళల్లో నైపుణ్యం, ఆత్మవిశ్వాసం, ఉపాధి అవకాశాలను పెంపొందించేందుకు రైజ్ ద్వారా నిరంతర చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. శిక్షణలో ఏఐ కంటెంట్ క్రియేషన్, ఏఐ ఇమేజ్ జనరేషన్, ఏఐ వీడియో క్రియేషన్, ఏఐ వాయిస్ అండ్ ఆడియో, సోషల్ మీడియా మార్కెటింగ్, ప్రాంప్ట్ ఇంజినీరింగ్ తదితర నైపుణ్యాలను నేర్పించినట్లు తెలిపారు. ఈ రంగాల్లో నైపుణ్యాలు అవసరమైన ఉద్యోగాలకు భారత్‌లో ప్రస్తుతం లక్షలాది ఖాళీలు ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకోవాలంటే ఎప్పటికప్పుడు నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. సృజనాత్మకత, ఆలోచనలు, నైపుణ్యాలు, కళలు, డిజిటల్ కంటెంట్ ద్వారా ఆర్థిక విలువను సృష్టించే ఆరెంజ్ ఎకానమీలో ఎన్‌టీఆర్ జిల్లాను నంబర్ వన్‌గా నిలిపేందుకు రైజ్ కేంద్రం ద్వారా వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా కంటెంట్ క్రియేట్ ల్యాబ్‌ను కూడా అందుబాటులో ఉంచామని, ఔత్సాహికులు దాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాలకు అనుగుణంగా, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఐటీ శాఖ మంత్రి దిశానిర్దేశంతో కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో సింటిల్లా డిజిటల్ అకాడమీ సీఈవో కె.సతీష్‌కుమార్ మాట్లాడుతూ గ్రామీణ మహిళల్లోని ప్రతిభ, సృజనాత్మకత, ఆలోచనలకు ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను జోడించి ఉపాధి అవకాశాలను విస్తృతం చేసేందుకు రైజ్ దోహదపడుతోందన్నారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ, నిబద్ధత కార్యక్రమం విజయవంతానికి ప్రధాన కారణమని పేర్కొన్నారు. ఏఐ, డిజిటల్ కంటెంట్ క్రియేషన్, బ్రాండింగ్, సోషల్ మీడియా మార్కెటింగ్, డిజైన్, వీడియో ప్రొడక్షన్ వంటి నైపుణ్యాల్లో శిక్షణ ఇవ్వడం ద్వారా మహిళల ఆలోచనలకు కొత్త రూపం, ఉత్పత్తులకు కొత్త మార్కెట్, జీవితాలకు కొత్త అవకాశాలు ఏర్పడుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, రైజ్ మేనేజర్ బి.తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

వీరో శ్రేణిని మరింత విస్తరించిన మహీంద్రా

విజయవాడ



భారతదేశపు ప్రముఖ యుటిలిటీ వాహనాల తయారీ సంస్థ, 3.5 టన్నుల లోపు తేలికపాటి వాణిజ్య వాహనాల (ఎల్‌సీవీ) విభాగంలో అగ్రగామి మహీంద్రా అండ్ మహీంద్రా లిమిటెడ్ సరికొత్త వీరో 1.1 డబుల్ ఎక్స్‌ఎల్ సీఎన్‌జీతో పాటు అప్‌గ్రేడ్ చేసిన వీరో డీజిల్ వాహనాలను ఆవిష్కరించింది. 2024 సెప్టెంబర్‌లో మార్కెట్లోకి వచ్చిన వీరో, అధిక మైలేజీ, పనితీరు, భద్రతా ఫీచర్లతో ఎల్‌సీవీ విభాగంలో ప్రత్యేక గుర్తింపు పొందింది. మహీంద్రా అభివృద్ధి చేసిన మల్టీ-ఎనర్జీ మాడ్యులర్ కమర్షియల్ వెహికల్ ప్లాట్‌ఫామ్ 'అర్బన్ ప్రాస్పర్ ప్లాట్‌ఫాం' (యూపీపీ) ఆధారంగా కొత్త వాహనాలను రూపొందించారు. వీరో 1.1 డబుల్ ఎక్స్‌ఎల్ సీఎన్‌జీ 1.1 టన్నుల పేలోడ్, 2,900 మి.మీ. కార్గో డెక్‌తో వస్తుంది. 1.5 లీటర్ ఇంజిన్ 48.5 కిలోవాట్ల శక్తి, 98 ఎన్‌ఎం టార్క్‌ను అందిస్తుంది. ఏఆర్ఏఐ ధ్రువీకరించిన 21.4 కి.మీ./కిలో ఇంధన సామర్థ్యంతో పాటు 450 కి.మీ.కు పైగా డ్రైవింగ్ రేంజ్‌ను అందిస్తుంది. ఎఫ్ఎంసీజీ, పండ్లు-కూరగాయలు, ఈ-కామర్స్, పార్శిల్, కొరియర్, మార్కెట్ లోడ్‌ల వంటి నగర రవాణా అవసరాలకు ఇది అనువుగా ఉంటుందని సంస్థ తెలిపింది. అప్‌గ్రేడ్ చేసిన డీజిల్ వీరోలో 26.03 సెం.మీ. టచ్‌స్క్రీన్, ఆండ్రాయిడ్ ఆటో, క్రూయిజ్ కంట్రోల్, ఎయిర్‌బ్యాగులు, రివర్స్ పార్కింగ్ కెమెరా, పవర్ విండోలు వంటి ఫీచర్లు ఉన్నాయి. డీజిల్ శ్రేణి సెప్టెంబర్ 8 నుంచి, సీఎన్‌జీ వాహనం సెప్టెంబర్ 20 నుంచి అందుబాటులోకి రానుంది.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా
ఎమ్మెల్యే సుజనా చౌదరి పాలన
విద్య, వైద్య రంగాల బలోపేతమే లక్ష్యం
ఏపీ నూర్‌భాషా దూదేకుల కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మీరా



విజయవాడ, మహానగర్

విద్య, వైద్య రంగాల బలోపేతంతో పాటు పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ఎమ్మెల్యే సుజనా చౌదరి పనిచేస్తూ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటున్నారని ఏపీ నూర్‌భాషా దూదేకుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మీరా అన్నారు. సుజనా ఫౌండేషన్, క్రిస్ప్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో చిట్టినగర్‌లోని శ్రీ నగరాల సీతారామస్వామి కల్యాణ మండపంలో మంగళవారం 'విజయ దీపం' రెండేళ్ల వేడుకలు, టీచర్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన నాగుల్ మీరా మాట్లాడుతూ.. గత రెండేళ్లలో 'విజయ దీపం' ద్వారా అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చి, ఎర్లీ చైల్డ్‌హుడ్ ఎడ్యుకేషన్‌పై అవగాహన కల్పించడంతో పాటు పలు కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. మహిళల ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇస్తూ గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు, గర్భిణులకు 2డీ ఎకో పరీక్షలు, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పటిష్టమైన కార్యాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారని, 47 వేల అత్యధిక మెజారిటీతో గెలిపించిన ప్రజల నమ్మకాన్ని నిలబెడుతూ పశ్చిమ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, సుజనా ఫౌండేషన్ సీఈఓ సుధా, ఉపాధ్యాయులు, క్రిస్ప్ ఆర్గనైజేషన్ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ప్రశాంతి, జహీదా, క్రిస్ప్ ఆర్గనైజేషన్ టీం లీడర్ వీ. మృదుల, స్టేట్ లీడర్ భవ్య, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్లు కీర్తి, యశస్విని, తేజస్వి, ప్రత్యూష, వైష్ణవి, చల్లంరాజు వెంకట శేషయ్య ఎండోమెంట్ ట్రస్ట్ చైర్మన్ ముదిగొండ శివ, 48వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు బెవర జోగేశ్వరరావు, పేరా భక్తుల రమణ, ఖాజా, దీటి ప్రభుదాస్, పైలా నరసింహారావు, గుడేల మహేష్, సుజనా మిత్రా కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

దివ్యాంగులకు హీల్ సేవలు అభినందనీయం



ఆగిరిపల్లి, మహానగర్:

నిరుపేద పిల్లలకు ఉచిత విద్య, వసతి, అంధ బాలల పాఠశాలలతో పాటు పుట్టుకతో లేదా ప్రమాదాల్లో అవయవాలు కోల్పోయిన దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు అందిస్తున్న హీల్ సంస్థ సేవలు అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ పారా స్పోర్ట్స్ కార్యదర్శి వి. రామస్వామి అన్నారు. మండలంలోని తోటపల్లి హీల్ కృత్రిమ అవయవ కేంద్రంలో విశ్రాంత ఏపీ జెన్‌కో ఇంజినీర్ల ఆర్థిక సహాయంతో విజయవాడకు చెందిన దివ్యాంగుడు కె. అప్పలనాయుడుకు కృత్రిమ కాలును రామస్వామి అందజేశారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో హీల్ సంస్థ అందిస్తున్న సేవలను ఆయన ప్రశంసించారు. కార్యక్రమంలో విశాఖపట్నం పారా స్పోర్ట్స్ ప్రెసిడెంట్ డా. షీతల్ మదన్, హీల్ సీఈఓ కూరపాటి అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన యువకుడు




నూజివీడు, మహానగర్

పట్టణంలోని ఎంప్లాయిస్ కాలనీకి చెందిన మోటార్ బైక్ మెకానిక్ పిల్లి మహేష్ (26) మంగళవారం ఉదయం నుంచి కనిపించడంలేదని పోలీసులు తెలిపారు. రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఐవీ నాగేంద్ర కుమార్ ఆదేశాలతో పోలీసులు మహేష్ ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా నున్న ప్రాంతంలో గాలింపు చేపట్టారు. పోలవరం కాలువ సమీపంలో మహేష్‌కు చెందిన స్కూటీ, సెల్‌ఫోన్ లభించాయని తెలిపారు. తల్లి మందలించడంతో మహేష్ ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు పోలీసులు పేర్కొన్నారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

‘కూలిన’ జవాబుదారీతనం

దక్షిణ ఢిల్లీలోని సత్యనికేతన్ ప్రాంతంలో ఐదు అంతస్థుల పెయింగ్ గెస్ట్ హాస్టల్ భవనం కుప్పకూలి, పలువురు విద్యార్థులు దుర్మరణం పాలవడం మనసులు కలచివేస్తున్నది. యాభైయేళ్ళనాటి భవనానికి బేస్‌మెంట్‌లో కొన్ని మార్పుచేర్పులు చేపట్టడంతో అది పేకమేడలాగా కుప్పకూలింది. అప్పటికే వర్షాలకు తడిసిముద్దయి ఉన్న ఈ భవనం బేస్‌మెంట్‌లోకి నీరు కూడా చేరివున్న స్థితిలో, నిపుణుల పర్యవేక్షణ లేకుండా రిపేర్లు చేయడం వల్లనే ఈ ప్రమాదం జరిగిందంటున్నారు. రాష్ట్రపతి, ప్రధాని సహా పెద్దలంతా ఈ ప్రమాదం మీద కూడా ఆశ్చర్యాన్నీ, ఆవేదననూ ప్రకటించారు. బాధిత కుటుంబీలకు సానుభూతి తెలియచేశారు. ప్రమాదం జరిగిన తరువాత మనదేశంలో సకల వ్యవస్థలూ స్పందించే తీరు, వేగం ఆశ్చర్యం కలిగిస్తూనే ఉంటుంది. ఏకంగా పదిపోలీసు బృందాలు, మూడు రాష్ట్రాలను జల్లెడపట్టి, రాజస్థాన్‌లో దాక్కున్న ఈ భవనం యజమానిని ఢిల్లీ లాక్కొచ్చాయి. ఆయన సహా కొందరు కుటుంబీలను సైతం అరెస్టుచేశారు. ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా తీవ్రంగా స్పందిస్తూ మేజిస్ట్రేట్ విచారణకు ఆదేశించారు. సౌత్ జోన్ డిప్యూటీ కమిషనర్ సహా ఐదుగురు మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ ఢిల్లీ (ఎంసీడీ) అధికారులు సస్పెండ్ అయ్యారు. అనుమతులు లేని, నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న నిర్మాణాలపై ఇకపై ‘జీరో టాలరెన్స్’ విధానం అమలవుతుందట. అంతేనా? భవిష్యత్తులో ఇలాంటి ఘటనలను పునరావృతం కాకుండా ఉండేందుకు ఢిల్లీలోని అన్ని ప్రైవేటు పీజీ భవనాలకు స్ట్రక్చరల్ ఆడిట్ తప్పనిసరి చేస్తున్నట్లు కూడా ఢిల్లీ ప్రభుత్వం ప్రకటించింది. హాస్టల్ భవనాల నిర్మాణవేగాన్ని పెంచవలసిందిగా తమ అనుబంధ కళాశాలలకు ఢిల్లీ యూనివర్సిటీ వీసీ ఆదేశాలు జారీ చేశారు. ఢిల్లీ హైకోర్టు కూడా ఈ ప్రమాదఘటనపై తీవ్ర ఆందోళన వెలిబుచ్చుతూ, నగరంలోని అన్ని ప్రైవేటు పీజీ భవనాల్లో విద్యార్థుల భద్రత మీద వారంలోగా నివేదిక ఇవ్వాలని కేంద్రానికీ, ఢిల్లీ ప్రభుత్వానికీ, మున్సిపల్ కార్పొరేషన్‌కు నోటీసులు ఇచ్చింది. ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ కూడా బీజేపీ అధీనంలోనే ఉన్నందున ఈ ఘటనను ట్రిపుల్ ఇంజన్ సర్కారు వైఫల్యంగా కాంగ్రెస్ అభివర్ణిస్తోంది. ఢిల్లీ పీజీ హాస్టల్ వ్యాపారం అంతా బీజేపీ నాయకులు, వారి మద్దతుదారుల అధీనంలో నడుస్తోందని ఆప్ విమర్శిస్తోంది. ఇటువంటి ఘోరాలు జరగ్గానే వ్యక్తులు, వ్యవస్థలు ఎలా ఉలిక్కిపడతాయో గతంలోనూ చూసిందే. ఎంతటివారినైనా వదిలేది లేదని నాయకులు హామీ ఇవ్వడం నుంచి, న్యాయస్థానాలు వాపోవడం వరకూ అంతా వింటున్నదీ కంటున్నదే. ఢిల్లీ ‘ప్రమాదాల’ జాబితాలోకి ఇప్పుడు సత్యనికేతన్ ఘటన కొత్తగా వచ్చిచేరింది అంతే. దీనికిముందు ఒక హాస్టల్ భవనం మునిగిపోవడం నుంచి, ఒక గెస్ట్‌హౌస్ తగలబడిపోవడం వరకూ అనేకం చూశాం. ఆరు గదులకు అనుమతి తీసుకొని, పాతిక గదుల్లో జనాన్ని నింపి, బేస్‌మెంట్లో రెస్టారెంట్ నిర్వహించిన కారణంగా, ఆ ఐదంతస్తుల భవనం అగ్నికి ఆహుతై విదేశీయులతో సహా పలువురు విద్యార్థులు సైతం ప్రాణాలు పొగొట్టుకున్న మాలవీయనగర్ విషాదం మూడునెలల క్రితమే జరిగింది. దానికి సరిగ్గా మూడురోజుల ముందే, దక్షిణ ఢిల్లీలోని సాకేత్ మెట్రోస్టేషన్ సమీపంలోని భవనం కూలి పలువురు విద్యార్థులు మరణించారు. వీరంతా పొరుగున ఉన్న కోచింగ్ సెంటర్లలో శిక్షణ పొందుతూ ఈ హాస్టల్‌లో ఉంటున్నవారు. రాకపోకలకు ఒకేమార్గం ఉన్న ఈ భవనం ఎత్తును అక్రమంగా పెంచుతున్నారని విద్యార్థులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. ఒకపక్క పైన బరువు పెంచి, మరోవైపు బేస్‌మెంట్‌లో సంప్ విస్తరణకోసం జరిపిన తవ్వకాలు దాని పునాదినే బలహీనపరచాయి. ఢిల్లీలో గత మూడేళ్ళలో వెయ్యికి పైగా భవనాలు వివిధ కారణాలవల్ల కూలినట్టు నివేదికలు చెబుతున్నాయి. విషాదం జరిగిన ప్రతీసారి ప్రభుత్వం ఏవో చర్యలు ప్రకటిస్తుంది, ఎవరినీ క్షమించేది లేదని, రక్షించేది ఉండదని అంటుంది. భద్రమైన భవిష్యత్తుకు గ్యారంటీ ఇస్తుంది. కానీ, మరో విషాదం జరిగేవరకూ ఊపిరిబిగబట్టి ఎదురుచూడటం వినా జనం చేయగలిగిందేమీ లేకపోతోంది. భద్రంగా లేని భవనాలు, అక్రమ నిర్మాణాలు, చట్టవిరుద్ధ వ్యాపారాలతో ఢిల్లీ ఒక్కటే కాదు, దేశంలోని నగరాలన్నీ వెలుగుతున్నాయి. దీనిని పర్యవేక్షణ లోపంగా చూడటం కంటే, మొత్తం నియంత్రణ వ్యవస్థ కుప్పకూలిందనడం సమంజసం. అవినీతి ఆకాశాన్ని అంటుతున్నదని, జవాబుదారీతనం మటుమాయమైందనీ ఈ విషాద ఘటనలు తెలియచెబుతాయి.

నిజరూప పట దర్శనం!




మాటలు కావొచ్చు, చేతలు కావొచ్చు-- ఏవీ శూన్యంనుంచి ఊడిపడవు. అనుద్దేశపూర్వకంగా, యథాలాపంగా ఏవీ ఉండవు. వాటిని ఉపయోగించేవారికి ఆ సంగతి తెలియొచ్చు... తెలియకపోవచ్చు. ఒక్కోసారి బాధితులకు కూడా అర్థం కాకపోవచ్చు. కానీ వివక్షను ఎత్తిచూపినప్పుడు సరిదిద్దుకోవటం సంస్కారం. ఈ విషయంలో వ్యక్తుల్ని కొంతవరకూ క్షమించవచ్చు. కానీ ప్రపంచ దేశాల సారథి ఐక్యరాజ్యసమితిని క్షమించగలమా? ప్రపంచ పటంలో మా ఖండాన్ని చిన్నబుచ్చుతున్నారని ఆఫ్రికా దేశాలు దశాబ్దాలుగా ఎత్తిచూపుతున్నాయి. అయినా దాన్ని సరిదిద్దుకోవటానికి దీర్ఘకాలం పట్టింది. ఎట్టకేలకు మొన్న శుక్రవారం దాన్ని సవరించుకుంది. ఏకంగా 164 దేశాలు తీర్మానానికి అనుకూలంగా ఓటేస్తే, ఎప్పట్లానే అమెరికా ఉలిపికట్టె ధోరణి ప్రదర్శించింది. ఎప్పుడో పదహారో శతాబ్దంనాటి మాట. భౌగోళిక పటాల రూపకర్త గెరార్డస్ మెర్కేటర్ తొలిసారి 1569లో ప్రపంచ పటాన్ని రూపొందించాడు.

దక్షిణార్ధ గోళ దేశాలను, ముఖ్యంగా భూమధ్య రేఖ సమీప దేశాలను వాటి వాస్తవ పరిమాణంకన్నా తక్కువగా చూపాడాయన. అప్పటికున్న పరిజ్ఞానం పరిమితుల్లో అలా చేశాడని సరిపెట్టుకోవటానికి లేదు. అదే నిజమైతే ఉత్తరార్ధ గోళ దేశాలనూ, ధ్రువాలకు సమీపంలో ఉన్నవాటినీ పెంచి ఎలా చూపగలిగాడు? ఏమైతేనేం... ప్రపంచపటం ఇన్నాళ్లకు సక్రమమైంది. ఖండాలను వాటి నిష్పత్తికి అనుగుణమైన వైశాల్యాల్లో రూపొందించారు. కానీ ఆ క్రమంలో మన జమ్మూ కశ్మీర్, లద్దాఖ్ భూభాగంలోని కొన్ని ప్రాంతాలను ఆ పటం చైనా, పాకిస్తాన్‌లకు ‘పంచిపెట్టింది’. మన విదేశాంగ శాఖ చెప్పినట్టు ఇదేమీ దేశాల హద్దుల్ని అధికారికంగా నిర్ధారించేది కాకపోవచ్చు. కానీ ఒక తప్పును సరిదిద్దుకునే క్రమంలో కొత్త తప్పుల్ని చేయరాదన్న ఇంగిత జ్ఞానం లోపించింది. అమెరికాలో కొంత భూభాగాన్ని వేరేవాళ్ల ఖాతాలో వేసి ఉంటే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఊరుకునేవారా?

అవతలివారిపై ఆధిక్యతాభావం మనిషి సరానరాల్లోనూ వ్యాపించిన జాడ్యం. దీనికి భౌగోళిక హద్దులేమీ లేవు. అది జాత్యహంకారంగా, వర్ణవివక్షగా, ఆర్థికంగా అధికులమనే భావనగా వ్యక్తం కావటం ఎవరికీ తెలియంది కాదు. కులాన్నిబట్టి, మతాన్నిబట్టి మేం అధికులం, అన్యులు అల్పులన్న భావన ప్రబలంగా ఉండటం మన అనుభవంలో ఉన్నదే. తెల్లతోలు ఉన్నవాళ్లు అసాధారణ మానవులు, మిగిలినవాళ్లంతా అల్పులనే భావన పాశ్చాత్య దేశాల్లో ఇప్పటికీ పోలేదు. హిట్లర్ హయాంలో యూదుల్ని జర్మనీ వెంటాడి, వేటాడి హతమార్చటం వెనుకా... ఎనిమిది దశాబ్దాలపైగా పాలస్తీనాలో మారణహోమాన్ని సాగిస్తున్న అమానుష ఇజ్రాయెల్ వెనకా ఈ జాడ్యం తాలూకు ఛాయలే కనబడతాయి. అమెరికాలో కనబడే శ్వేతజాతి అహంకారం కూడా ఈ బాపతే. మనిషి అంతరాంతరాల్లో ఇలాంటివి గూడు కట్టుకున్నప్పుడు వారి వ్యవహార శైలిలో అది ప్రతిబింబించక మానదు. ఒక ప్రాంత భౌగోళిక వైశాల్యం ఎంతో చెప్పే పటాలు చూడటానికి అన్నిటికీ అతీతంగా, అలీనంగా కనబడతాయి. కానీ పటాల రూపకల్పనలో చోటుచేసుకునే రాజకీయాల గురించి 2020లో కార్నెల్ వర్సిటీ అధ్యాపకురాలు క్రిస్టిన్ లూయెన్‌బెర్గర్ చాలా సంగతులే చెప్పారు. దృగ్గోచరమయ్యే రాజకీయాలతో పాటు, ప్రచ్ఛన్నంగా, గుట్టుగా ఉండిపోయే రాజకీయాలు కూడా ఈ పటాల రూపకల్పనలో ఉంటాయని ఆమె అభిప్రాయం. ప్రతి పటమూ చూపవల్సినంతగా చూపుతూనే, దాచాల్సింది దాస్తుందనీ, నిర్దిష్ట సమూహం కోసమే ఇదంతా జరుగుతుందనీ క్రిస్టిన్ అంటారు. గుండ్రంగా ఉండే భూమిని చదునైన కాగితంపై చూపితే కొంత వక్రీకరణ ఎలాగూ తప్పదు. కానీ గ్రీన్‌ల్యాండ్ కన్నా 14 రెట్లు పెద్దదైన ఆఫ్రికా... దాని ముందు చిన్నబోవట మేమిటి? యూరప్, అమెరికాలు కూడా తమ వాస్తవ విస్తీర్ణంకన్నా అధికంగా కనబడతాయెందుకు? ఆఫ్రికాతోపాటు దక్షిణ అమెరికా, భారత్‌లు చిన్నగా ఉంటాయి. కాగితాల్లో తప్పుడు గీతలు గీసి అధికులమనుకోవటం... తరగతి గదుల్లో రూపుదిద్దుకునే తరాలకు అజ్ఞానాన్ని బట్వాడా చేయటం సిగ్గుచేటు కాదా? సమితికి ఇంతకన్నా ప్రాధాన్యం గలవి చాలా ఉన్నాయని ట్రంప్ ఉవాచ. అందుకే తీర్మానాన్ని వ్యతిరేకించారట. నిజమే... ప్రాధాన్యం గలవి ఇంకా ఉన్నాయి. ఆ లెక్కలు కూడా తేలిస్తే అమెరికా వంచన మరింత తేటతెల్లమవుతుంది!

చట్టసభల గుమ్మంలో ప్రజాస్వామ్య ద్రోహం

ప్రజాస్వామ్యానికి దేవాలయాలుగా, కోట్లాది మంది ప్రజల ఆశాజ్యోతులుగా వెలుగొందే చట్టసభల ప్రాంగణం నేడు అధికారమదంతో కూడిన పోలీసు దౌర్జన్యాలకు వేదికగా మారడం సమకాలీన రాజకీయ చరిత్రలో అత్యంత అసహ్యకరమైన, లజ్జాకరమైన అధ్యాయం. శాసనసభ ముంగిట ప్రతిపక్ష బీఆర్ఎస్ మహిళా శాసనసభ్యుల పట్ల పోలీసులు వ్యవహరించిన అనాగరిక, దురహంకారపూరిత తీరు రాజ్యాంగ స్ఫూర్తిని నిలువునా దహించివేసింది. ప్రజల గొంతుకగా అసెంబ్లీకి వస్తున్న మహిళా ప్రజాప్రతినిధుల జుట్టు పట్టుకుని లాగడం, గొంతు నులమడం, వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా చీరలు లాగుతూ వ్యవహరించడం ఏ రకమైన పాలనకు సంకేతం? ఇది కేవలం కొందరు నేతలకు జరిగిన పరాభవం కాదు; ఇది దేశంలోని మొత్తం మహిళా సమాజానికి, రాజ్యాంగ వ్యవస్థలకు జరిగిన పూడ్చలేని గాయం. ప్రజాస్వామ్యంలో నిరసనలు తెలుపడం, ప్రభుత్వాన్ని ప్రశ్నించడం, ప్రజా సమస్యలపై నిలదీయడం రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు. ప్రభుత్వ వైఫల్యాలు, పనితీరుపై ప్రజాప్రతినిధులు శాసనసభకు వచ్చి నిరసనను వ్యక్తం చేయడం అనాదిగా వస్తున్న ప్రజాస్వామ్య సంప్రదాయం. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు శాసనసభకు చేరుకున్న మాజీ మంత్రులు, సీనియర్ శాసనసభ్యులమైన నాపై (పి. సబితా ఇంద్రారెడ్డి), సునీతా లక్ష్మారెడ్డితోపాటు ఇతర మహిళా ప్రజాప్రతినిధులను అడ్డుకునేందుకు పోలీసులు ప్రదర్శించిన నిర్బంధ వైఖరి శాంతిభద్రతల పరిరక్షణ కాదు; అది కేవలం అధికారపక్ష అణచివేత ధోరణి. శాసనసభ ముంగిట నిరసన తెలిపే హక్కును కాలరాస్తూ, భౌతిక దాడులకు పూనుకోవడం రాజ్యాంగబద్ధమైన పాలన స్థానే పోలీసు రాజ్యాన్ని ప్రతిష్ఠించే కుట్రలా కనిపిస్తున్నది. ‘ప్రజాపాలన’ అనే పదబంధాన్ని ఊతపదంగా వాడుకొనే ప్రస్తుత పాలకుల అసలు రంగు ఈ ఘటనతో పూర్తిగా బయటపడింది. ఈ ఘోర కలికి కాంగ్రెస్ అధిష్ఠానం జాతీయ స్థాయిలో మాట్లాడే నీతులకు, రాష్ట్ర స్థాయిలో వారు అనుసరిస్తున్న అణచివేత చర్యలకు ఉన్న తీవ్ర వ్యత్యాసాన్ని ఎండగట్టాల్సిన అవసరం ఉన్నది. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పార్లమెంట్ ప్రాంగణంలో కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ నాయకత్వంలో నల్లచొక్కాలు ధరించి, పోస్టర్లు పట్టుకొని నిరసన తెలిపినప్పుడు అది ప్రజాస్వామ్య పరిరక్షణగా, రాజ్యాంగ హక్కుగా ఊదరగొట్టిన ఆ పార్టీ నాయకత్వం, నేడు తెలంగాణ అసెంబ్లీ వద్ద ప్రతిపక్ష బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నల్ల టీషర్ట్‌లతో అసెంబ్లీకి వస్తే పోలీసులతో దాడి చేయించడంలో ఉన్న ఔచిత్యం ఏంది? జాతీయ స్థాయిలో ఒక రాజ్యాంగ సూత్రం, స్వయంగా అధికారంలో ఉన్న రాష్ట్రంలో మరొక అణచివేత సూత్రం చెల్లుబాటు అవుతుందా? రాహుల్ నిరసన తెలిపితే అది పోరాటం, తెలంగాణలో మహిళా ప్రజాప్రతినిధులు నిరసన తెలిపితే నేరమా? ఈ దగాకోరు ద్వంద్వవిధానాన్ని ప్రజాస్వామ్యవాదులు ఏవిధంగా సమర్థిస్తారు? భారత రాజకీయ చరిత్రను తిరగేస్తే, చట్టసభల లోపల లేదా వెలుపల మహిళా నేతలపై భౌతికదాడులకు దిగిన ప్రతి సందర్భంలోనూ పాలకులు ప్రజల గ్రహపాటుకు గురయ్యారనేది స్పష్టమవుతున్నది. తమిళనాడు శాసనసభలో నాటి ప్రతిపక్ష నేత జయలలితపై అసెంబ్లీ ప్రాంగణంలో దాడి చేసి, ఆమె చీరను లాగి అవమానించినప్పుడు, కన్నీళ్లతో బయటకువచ్చిన ఆమె మళ్లీ ముఖ్యమంత్రిగానే సభలో అడుగుపెడుతానని శపథం చేశారు. ఆ తర్వాత జరిగిన పరిణామాలు ఆ రాష్ట్ర రాజకీయ చిత్రాన్నే మార్చేశాయి. 1995లో ఉత్తరప్రదేశ్‌లో మాయావతిపై జరిగిన భౌతికదాడి నాటి ప్రభుత్వ పతనానికి నాంది పలికింది. కేరళ శాసనసభలో 2015 బడ్జెట్ సమావేశాల సందర్భంగా మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన అణచివేత చర్యలు తీవ్ర వ్యతిరేకతకు దారితీశాయి. సింగూర్ ఉద్యమ సమయంలో టీఎంసీ అగ్ర నేత మమతా బెనర్జీని పోలీసులు ఈడ్చిపారేసిన దృశ్యాలు వామపక్ష ప్రభుత్వ శాశ్వత పతనానికి బాటలు వేశాయి. చరిత్ర నేర్పిన ఈ గుణపాఠాలను కాంగ్రెస్ పాలకులకు గుర్తుచేయాల్సిన అవసరం ఉన్నది. అధికారమదంతో మహిళా నేతల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేందుకు ఏ ప్రభుత్వం పూనుకున్నా, కాలక్రమంలో వారు తీవ్ర రాజకీయ పరిణామాలను ఎదుర్కోక తప్పదు. ఒకవైపు చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చట్టాలు తెస్తున్నామని గొప్పలు చెప్పుకొనే రాజకీయ వ్యవస్థ, మరోవైపు ఎన్నుకైన మహిళా ప్రజాప్రతినిధుల మీదనే ఈ రకమైన తీవ్ర భౌతికదాడులకు దిగడం హేయమైన చర్య. మాజీ మంత్రులుగా, శాసనసభ్యులుగా సమాజంలో ఎంతో గౌరవం ఉన్న నాకు (సబితా ఇంద్రారెడ్డి), సునీతాలక్ష్మారెడ్డి వంటి సీనియర్ నాయకులకే రక్షణ లేకపోతే, రేపు రాజకీయాల్లోకి రావాలనుకునే సాధారణ మహిళలకు ఈ వ్యవస్థ ఎలాంటి సంకేతాన్ని ఇస్తుంది?. ద్రౌపది వస్త్రాపహరణం సభామధ్యలో జరిగినప్పుడు మౌనంగా ఉన్న రాజ్యాంగ వ్యవస్థలు ఏ విధంగా కూలిపోయాయో మహాభారతం చెప్పింది. నేడు శాసనసభ గుమ్మం వద్ద జరిగిన ఈ ఘోరం



కూడా ప్రజాస్వామ్య వ్యవస్థకు పట్టిన మహమ్మారే. ప్రస్తుత ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం వెంటనే సమాధానం చెప్పాలి. పోలీసు బలగాలను ఉపయోగించి ప్రతిపక్షాలను, ప్రత్యేకించి మహిళా నేతలను నిర్దాక్షిణ్యంగా అణచివేయడం ద్వారా పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకోలేరు. మహిళా శాసనసభ్యుల చీరలు లాగిన, గొంతు నొక్కిన, జుట్టు పట్టుకుని లాగిన పోలీసు అధికారులను తక్షణమే గుర్తించి ఉద్యోగాల నుంచి తొలగించి, వారిపై కఠిన క్రిమినల్ కేసులు నమోదు చేస్తారా? లేదా, ఈ వికృతచేష్టలకు తామే స్వయంగా ఆదేశాలిచ్చామని, పోలీసుల ‘అతి’ వెనుక ప్రభుత్వ హస్తం ఉన్నదని బహిరంగంగా ఒప్పుకొంటారా? తాత్కాలికంగా పోలీసు బలగాల వెనుక దాక్కొని, భౌతిక దాడుల ద్వారా ప్రతిపక్షం నోళ్లు మూయించి పాలకులకు పైశాచిక ఆనందం కలుగవచ్చు. కానీ ప్రజాస్వామ్యంలో ఏ ప్రభుత్వమూ శాశ్వతం కాదనే సత్యాన్ని విస్మరించవద్దు. నేడు అధికారంలో ఉన్నవారు రేపు ప్రతిపక్షంలోకి రాక తప్పదు. చట్టసభల గౌరవాన్ని, నిరసన తెలిపే రాజ్యాంగ హక్కును, మహిళా ప్రజాప్రతినిధుల ఆత్మగౌరవాన్ని కాలరాస్తే, రేపు ప్రజ ల ఆధ్వర్యంలో ఎదురయ్యే నిరసన మంటలకు ప్రభుత్వం బలికావడం ఖాయం! ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని, తన ప్రజాస్వామ్య వ్యతిరేక తీరును మార్చుకోవాలని హెచ్చరిస్తున్నాం.

నా వడోదరా అద్భుతం

అభివృద్ధి పనులను ప్రశ్నించే వారిపై ప్రధాని నరేంద్ర మోదీ తనదైన శైలిలో సెటైర్లు వేశారు. డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ వల్ల ట్రక్కు డ్రైవర్ల పరిస్థితి ఏంటని ప్రశ్నించే నారాజ్ ఫూఫా (అలకపాన్పు ఎక్కిన మేనమామ) ఒకరు ఉంటారని వ్యాఖ్యానించారు. ఇప్పుడు ఆ నారాజ్ ఫూఫాకు కూడా పని దొరికిందంటూ చురకలు అంటించారు. గుజరాత్‌లోని వడోదరలో రూ.35 వేల కోట్లకుపైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసిన మోదీ, 2047 నాటికి భారత్‌ను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

'నారాజ్ ఫూఫాకు పని దొరికింది

డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ మోదీ ప్రతిపక్షాలపై విమర్శలు గుప్పించారు. ఈ కారిడార్ వల్ల ట్రక్కుల అవసరం తగ్గితే ట్రక్కు డ్రైవర్ల పరిస్థితి ఏంటని కొందరు ప్రశ్నిస్తారని అన్నారు. అలాంటి వారిని నారాజ్ ఫూఫాగా అభివర్ణించారు. 'ట్రక్ డ్రైవర్ల పరిస్థితి ఏంటి? ట్రక్కులు ఎక్కడికి వెళ్తాయి? ట్రక్కులు కొనుగోలు చేసిన వారి పరిస్థితి ఏంటి?' అంటూ వారు ప్రశ్నిస్తారని మోదీ అన్నారు. ఇప్పుడు ఆ నారాజ్ ఫూఫాకు కూడా పని దొరికిందని చమత్కరించారు. ఎవరి పేరును ప్రస్తావించకుండానే ఈ వ్యాఖ్యలు చేశారు.

250 ట్రక్కుల సరుకు ఒకే రైలులో!


డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ సామర్థ్యాన్ని వివరించేందుకు మోదీ ఓ ఉదాహరణ చెప్పారు. ఇటీవల ముంబైలోని జవహర్‌లాల్ నెహ్రూ పోర్ట్ నుంచి వడోదరకు డబుల్‌స్టాక్ కంటైనర్ రైలు నడిచిందని తెలిపారు. ఒకే రైలులో రెండు వరుసల్లో కంటైనర్లను తరలించినట్లు చెప్పారు. ఈ ఒక్క రైలు ప్రయాణంలో తరలించిన సరుకు 250కుపైగా ట్రక్కులు మోసే సామర్థ్యానికి సమానమని వివరించారు. ఇలాంటి రైళ్లతో సరుకు రవాణా వేగంగా జరగడంతో పాటు ఇంధనం, సమయం, రవాణా ఖర్చులు కూడా ఆదా అవుతాయని చెప్పారు.

2,800 కి.మీ. ఫ్రైట్ కారిడార్ పూర్తి

దేశంలో సరుకు రవాణా వ్యవస్థలో కీలక మార్పునకు కారణమవుతున్న డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ పనులు పూర్తయ్యాయని ప్రధాని ప్రకటించారు. తూర్పు, పశ్చిమ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్లు కలిపి మొత్తం 2,800 కిలోమీటర్ల పొడవు ఉన్నాయని తెలిపారు. దేశ వాణిజ్యం, సరుకు రవాణాకు ఈ కారిడార్లు వెన్నెముకగా మారుతున్నాయని మోదీ అన్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న భారత్‌కు ఇవి లైఫ్‌లైన్‌లా పనిచేస్తున్నాయని చెప్పారు. గతంలో ప్రయాణికుల రైళ్లు, సరుకు రైళ్లు ఒకే ట్రాక్‌పై నడిచేవని, దీంతో ప్రయాణికుల రైళ్ల వేగంతో పాటు సరుకు రవాణా కూడా నెమ్మదించేదని తెలిపారు. ప్రత్యేకంగా సరుకు రైళ్ల కోసం ఏర్పాటు చేసిన కారిడార్ అందుబాటులోకి రావడంతో ఈ సమస్య పరిష్కారమైందన్నారు.

100 కి.మీ. ప్రయాణం- సగం సమయంలోనే!

ఫ్రైట్ కారిడార్ వల్ల సరుకు రవాణా వేగం గణనీయంగా పెరిగిందని మోదీ చెప్పారు. గతంలో సరుకు రైలు 100 కిలోమీటర్లు ప్రయాణించడానికి సుమారు 6.5 గంటలు పట్టేదని, ఇప్పుడు అదే దూరాన్ని సగం కంటే తక్కువ సమయంలో చేరుకుంటోందన్నారు. ట్రక్కులో సాధారణంగా 30 గంటలు పట్టే సరుకు రవాణా, ఫ్రైట్ కారిడార్ ద్వారా 10 నుంచి 12 గంటల్లో పూర్తవుతోందని వివరించారు. దీనివల్ల ఇంధన వినియోగం తగ్గుతుందని, రవాణా ఖర్చులు ఆదా అవుతాయని, సమయం కూడా మిగులుతుందని చెప్పారు. పర్యావరణానికి కూడా ఇది మేలు చేస్తుందని పేర్కొన్నారు.



ప్రస్తుతం తూర్పు, పశ్చిమ ఫ్రైట్ కారిడార్లపై రోజుకు 430కుపైగా సరుకు రైళ్లు నడుస్తున్నాయని మోదీ తెలిపారు.

2014కు ముందు ఫైళ్లు తిరిగాయ్!

డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ ప్రాజెక్టుపై గత ప్రభుత్వాన్ని కూడా మోదీ విమర్శించారు. ఈ ప్రాజెక్టు ఆలోచన 2004లో ప్రారంభమైందని, 2006లో పనుల కోసం ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేసినా 2014 వరకు ప్రాజెక్టు పనులు ముందుకు సాగలేదని అన్నారు. ఏళ్ల తరబడి ఫైళ్లు ఒక కార్యాలయం నుంచి మరో కార్యాలయానికి తిరుగుతూనే ఉండేవని ఎద్దేవా చేశారు. 2014 తర్వాత కేంద్రంలో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ ప్రాజెక్టు పనులను వేగవంతం చేశామని చెప్పారు. గుజరాత్‌లో తనకు లభించిన అనుభవం, అక్కడి ప్రజల నుంచి నేర్చుకున్న పాఠాలను లీకి తీసుకెళ్లానని మోదీ తెలిపారు. ఆ అనుభవంతో దేశవ్యాప్తంగా అభివృద్ధి పనులను వేగంగా ముందుకు తీసుకెళ్లామని చెప్పారు.

రూ.35 వేల కోట్ల పనులు

వడోదరలో నిర్వహించిన నమో ఫర్ వికసిత్ భారత్ కార్యక్రమంలో మోదీ రూ.35 వేల కోట్లకుపైగా విలువైన పలు ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. వీటిలో పశ్చిమ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్‌కు సంబంధించిన మూడు కీలక విభాగాలు, రైల్వే ప్రాజెక్టులు, జాతీయ రహదారి పనులు, గుజరాత్ ప్రభుత్వానికి సంబంధించిన అభివృద్ధి ప్రాజెక్టులు ఉన్నాయి. న్యూ సనంద్, న్యూ మకర్‌పురా, న్యూ ఉంబర్‌గావ్, న్యూ జేఎన్‌పీటీ నుంచి సరుకు రైళ్లను మోదీ ప్రారంభించారు. టాండా రోడ్-వడోదర మధ్య ప్రయాణికుల రైలు సేవలను కూడా ప్రారంభించారు.

గతిశక్తికి పెద్దపీట

దేశ అభివృద్ధిలో కనెక్టివిటీ, మౌలిక వసతులకు అత్యంత ప్రాధాన్యం ఉందని ప్రధాని చెప్పారు. పంద్రాగస్టు సందర్భంగా ఎర్రకోట నుంచి చేసిన ప్రసంగంలో ప్రస్తావించిన సప్తధార సంకల్పంలో గతిశక్తి కూడా ఒకటని గుర్తు చేశారు. దేశంలోని వివిధ రవాణా మార్గాలను సమన్వయం చేయడం, సరుకు రవాణాను వేగవంతం చేయడం, లాజిస్టిక్స్ ఖర్చులను తగ్గించడం ద్వారా గతిశక్తి ప్రాజెక్టులు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలపై కోచింగ్ ఖర్చుల భారం తగ్గించేందుకు కేంద్రం మరో కీలక అడుగు వేస్తోందని మోదీ తెలిపారు. దేశంలోని అత్యుత్తమ ఉపాధ్యాయులతో విద్యార్థులకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ అందించే వ్యవస్థను తీసుకురావాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ప్రతి ఏడాది పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే పిల్లల కోచింగ్ కోసం మధ్యతరగతి కుటుంబాలు పెద్ద మొత్తంలో డబ్బు ఖర్చు చేస్తున్నాయని చెప్పారు. అలాంటి కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గించడమే ప్రభుత్వ ఉద్దేశమన్నారు.

ఏఐలో యువత నిపుణులు కావాలి

ప్రపంచం వేగంగా మారుతోందని దానికి అనుగుణంగా విద్య, ఉద్యోగాలు, నైపుణ్యాల అవసరాలు కూడా మారుతున్నాయని ప్రధాని అన్నారు. గతంలో డిగ్రీలకు మాత్రమే ప్రాధాన్యం ఉండేదని, ఇప్పుడు నైపుణ్యాలు కూడా అంతే ముఖ్యమని చెప్పారు. ప్రత్యేకంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో భారత యువత నైపుణ్యాలు పెంచుకోవాలని పిలుపునిచ్చారు. ఏఐలో భారత యువత ప్రపంచస్థాయిలో నిపుణులుగా ఎదగాలని ఆకాంక్షించారు. 2047 నాటికి దేశాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని మోదీ మరోసారి స్పష్టం చేశారు. రవాణా నుంచి విద్య, నైపుణ్యాల వరకు అన్ని రంగాల్లో ఆధునిక మార్పులు తీసుకురావడమే వికసిత్ భారత్ దిశలో కీలకమని పేర్కొన్నారు.

నా వడోదరా అద్భుతం.. ప్రధాని మోదీ భావోద్వేగం

గుజరాత్‌లోని వడోదరా నగరవాసులపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. తన పర్యటనకు స్వాగతంగా ప్రజలందరూ ఏకమై నగరాన్ని శుభ్రం చేయడానికి చేపట్టిన 'స్వచ్ఛతతో స్వాగతం' కార్యక్రమాన్ని చూసి తన హృదయం గర్వంతో ఉప్పొంగిపోయిందని ఆయన అన్నారు. నేడు మహారాజా సయాజీరావ్ యూనివర్సిటీలో జరిగిన 'నమో 4 వికసిత్ భారత్' కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. "నిన్న నేను ఒక వీడియో చూశాను. నా వడోదరాను చూసి నా ఛాతీ గర్వంతో ఉప్పొంగిపోయింది. అద్భుతం!" అంటూ నగర ప్రజల భాగస్వామ్యాన్ని కొనియాడారు. తన పర్యటనకు ముందు నగరం మొత్తం ఒక ప్రజా ఉద్యమంలా మారి శుభ్రత కార్యక్రమాలు చేపట్టడంపై ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం వడోదరాలోని ప్రతి కుటుంబంలో స్వచ్ఛతపై సరికొత్త వాతావరణాన్ని సృష్టించిందని పేర్కొన్నారు. ఈ స్వచ్ఛతా స్ఫూర్తిని రాబోయే పండుగలైన గణేశ్ చతుర్థి, నవరాత్రి, దీపావళి వరకు కొనసాగించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. "ఈసారి గణపతి వచ్చినప్పుడు, ఆయన ఆశీస్సులన్నీ వడోదరాపైనే కురుస్తాయని నేను భావిస్తున్నాను" అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ పరిశుభ్రతా కార్యక్రమాన్ని కేవలం తాత్కాలికంగా కాకుండా, శాశ్వత పౌర నిబద్ధతగా మార్చుకోవాలని సూచించారు.

"ఇప్పుడు మనం ఒక సంకల్పం తీసుకుందాం. వడోదరాను మళ్లీ అపరిశుభ్రంగా మారకుండా చూసుకుందాం" అని గుజరాతీలో ప్రజలను కోరారు. ప్రధాని మోదీ తన పర్యటనలో భాగంగా రూ.35,000 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఇందులో వెస్టర్న్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ (డబ్ల్యూడీఎఫ్‌సీ), కొత్త రైల్వే సేవలు, జాతీయ రహదారుల ప్రాజెక్టులు, గృహ నిర్మాణం, నీటి సరఫరా వంటివి ఉన్నాయి. వడోదరా మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ స్వచ్ఛతా కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు, పౌరులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యాసంస్థలు, ఎన్జీవోలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో భాగంగా 20 లక్షల మొక్కలను పంపిణీ చేసినట్లు తెలిపారు. కాగా, మోదీ కార్యక్రమానికి 'బుక్‌మైషో' ద్వారా ఉచిత రిజిస్ట్రేషన్లు నిర్వహించగా, గంటలోనే అందుబాటులో ఉన్న సీట్లన్నీ నిండిపోవడం, మరో 42,000 మందికి పైగా వెయిటింగ్ లిస్ట్‌లో ఉండటం విశేషం.

అరాచకాలను అరికట్టేందుకు హోం శాఖ ఏం చేస్తోంది?

దిల్లీలో మణిపుర్‌కి చెందిన సంగీత కళాకారుడిని కొట్టి చంపిన ఘటనపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ రాజధానిలోనే ఇంటి బయట ఓ తండ్రిని కొట్టి చంపడం ఆందోళనకరమని పేర్కొన్నారు. పెరుగుతున్న ఈ అరాచకాలను అరికట్టడానికి అమిత్? షా హోం మంత్రిత్వ శాఖ ఏం చేస్తోందని ప్రశ్నించారు. ఈ ఘటనపై వెంటనే దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. అలాగే ఈశాన్య రాష్ట్రాలకు చెందిన ప్రజల భద్రతపై ప్రశ్నలు లేవనెత్తారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'ఇంటి బయట శబ్దం తగ్గించమని చెప్పేందుకు కిందికి వెళ్లిన ప్రముఖ మణిపురి సంగీతకారుడిని కొట్టి చంపారు. దేశ రాజధానిలో తన ఇంటి బయటే ఓ తండ్రి హత్యకు గురయ్యారు. ఇలాంటి ఘటనలు వరుసగా జరుగుతున్న నేపథ్యంలో దిల్లీలో నివసిస్తున్న ప్రతి ఈశాన్య ప్రాంతాల కుటుంబం ఒకే ప్రశ్న అడుగుతోంది. ఇక్కడ మేం సురక్షితంగా ఉన్నామా? ముఖ్యంగా ఈశాన్య ప్రాంతాలకు చెందిన ప్రజలపై జరుగుతున్న ఘటనలను అరికట్టేందుకు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ, దిల్లీ పోలీసులు ఏం చేస్తున్నారు. పెరుగుతున్న అరాచకాన్ని నియంత్రించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలి. త్వరిగతిన దర్యాప్తు జరిపి, దోషులను న్యాయ స్థానం ముందు నిలబెట్టాలి' అని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు.

ప్రభుత్వాల నిర్లక్ష్యమే కారణం : పవన్ ఖేడా

మరోవైపు ఈ ఘటనపై కాంగ్రెస్ నేత, రాజ్యసభ ఎంపీ పవన్ ఖేడా కూడా తీవ్రంగా స్పందించారు. సంగీతకారుడి మృతి చుట్టు నెలకొన్న పరిస్థితులకు దారి తీసిన సంస్కృతిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సృష్టించాయని ఆరోపించారు. 'దీనిని మద్యం మత్తులో జరిగిన హింసాత్మక ఘటనగా కొట్టిపారేయవచ్చు. కానీ దీని వెనక ఇంకా చాలా ఉంది. గత కొన్నేళ్లుగా బహిరంగ ప్రదేశాల్లో భారీ డీజేలు, రచ్చ చేయడం, నిబంధనలను బేఖాతరు చేయడాన్ని ప్రభుత్వం అలవాటుగా మార్చింది. చట్టాన్ని కఠినంగా అమలు చేయాల్సింది పోయి, అధికారంలో ఉన్నవారు కళ్లు మూసుకోవడం వల్లే నేరస్థుల్లో భయం లేకుండా పోయింది. ఈ దారుణానికి దారితీసిన వాతావరణాన్ని సృష్టించిన బాధ్యత నుంచి ప్రభుత్వం తప్పించుకోలేదు' అని పవన్? ఖేడా అన్నారు. ఈ ఘటనపై ఈశాన్య భారత (నార్త్ ఈస్ట్) కమ్యూనిటీ ప్రతినిధి సంగీతా దేవి కూడా తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. విక్రమ్ సింగ్ కుటుంబానికి తక్షణమే న్యాయం చేయాలని, ఆయన కుటుంబ భవిష్యత్తును ప్రభుత్వం ఆదుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి

పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం, మణిపుర్?కు చెందిన సంగీతకారుడు చోంగ్తామ్ విక్ర సింగ్ (54) దిల్లీలోని కిలోక్రి గ్రామంలో కొన్నేళ్లుగా నివసిస్తున్నారు. సోమవారం తెల్లవారు జామున ఆయన ఇంటి సమీపంలో కొందరు ధాబా, డెలవరీ సిబ్బంది మద్యం సేవిస్తూ గట్టిగా ఆరుస్తున్నారు. దీంతో సింగ్ బయటకు వచ్చి శబ్దం తగ్గించాలని కోరారు. ఇరువురి మధ్య వివాదం తలెత్తడంతో వారు విక్రమ్? సింగ్?పై పిడిగుద్దులు, దెబ్బలతో దాడి చేసినట్లు పోలీసులు వెల్లడించారు. తీవ్రంగా గాయపడిన విక్రమ్?ను ఆయన కుమారుడు వెంటనే హోలీ ఫ్యామిలీ ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. అయితే చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారని తెలిపారు. ఈ ఘటనపై సన్?లైట్? కాలనీ పోలీస్? స్టేషన్ పీసీఆర్? కాల్ రావడంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారని పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని, దాడికి దారితీసిన పరిస్థితులు, విక్రమ్ మృతికి కారణాలపై దర్యాప్తు ప్రారంభించారు.

ఏడుగురు అరెస్ట్

ఘటనకు సంబంధించి పోలీసులు ఏడుగురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. అలాగే ఓ బాలుడిని కూడా అదుపులోకి తీసుకున్నారు. నిందితులపై తదుపరి చర్యలు కొనసాగుతున్నాయి. దాడి వెనుక ఉన్న పూర్తి కారణాలను తెలుసుకునేందుకు పోలీసులు విచారణ చేపట్టారు. విక్రమ్ సింగ్ మృతికి ఈశాన్య విద్యార్థి సంఘం కూడా సంతాపం తెలిపింది. దిల్లీ విశ్వవిద్యాలయానికి చెందిన నార్త్ ఈస్ట్ స్టూడెంట్స్ సొసైటీ ఆయనను గౌరవనీయమైన మణిపురి సంగీతకారుడిగా పేర్కొంది.

బ్రిక్స్ సదస్సు వేళ ప్రధాని మోదీ, పుతిన్ భేటీ

బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశానికి ముందు, సెప్టెంబర్? 11న దిల్లీలో భారత ప్రధాని నరేంద్ర మోదీతో, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భేటీ కానున్నారు. ఈ విషయాన్ని రష్యా అధికార ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ మంగళవారం వెల్లడించారు. తాము కొత్త అణు విద్యుత్ కేంద్రాల ఏర్పాటుపై భారత్‌తో చర్చల కోసం ఎదురుచూస్తున్నామని పెస్కోవ్? చెప్పారు. తమ ఎజెండాలో భారత్‌కు ఎస్‌యూ-57 విమానాల విక్రయం కూడా ఉందని ఆయన తెలిపారు. "భారతదేశం మా వ్యూహాత్మక భాగస్వామి. మేము భారత్?ను అత్యంత ముఖ్యమైన మిత్రదేశంగా పరిగణిస్తాం. ఇరుదేశాల నాయకుల మధ్య సత్సంబంధాలు ఉన్నాయి. ఇరుదేశాల మధ్య వాణిజ్య చెల్లింపుల్లో అధిక భాగం సొంత కరెన్సీల్లోనే జరుగుతోంది. ఇది క్రమంగా ఇంకా పెరుగుతోంది. రక్షణ, ఇంధనం, రవాణా, శాస్త్ర, సాంకేతిక, అంతరిక్ష రంగాల్లో ఇరుదేశాల మధ్య సహకారం విస్తరిస్తోంది" అని పెస్కోవ్ పేర్కొన్నారు.

మోదీ, పుతిన్ చాలా సన్నిహితులు

దిల్లీలో సెప్టెంబర్ 12 నుంచి బ్రిక్స్ సదస్సు ప్రారంభం కానుంది. ఇందులో పాల్గొనేందుకు రష్యా అధ్యక్షుడు పుతిన్ భారత్‌కు రానున్నారు. ఈ నేపథ్యంలో క్రెమ్లిన్ ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ మాట్లాడుతూ కీలక విషయాలు వెల్లడించారు. రష్యా, ఉక్రెయిన్? వివాదానికి శాంతియుత పరిష్కారాన్ని కనుగొనే ప్రయత్నాల్లో తన వంతు సహకారాన్ని అందించడానికి భారతదేశం చూపుతున్న సుముఖతను మాస్కో స్వాగతిస్తున్నట్లు ఆయన తెలిపారు. "మరో రెండు రోజుల్లో అధ్యక్షుడు పుతిన్? తన భారత పర్యటనను ప్రారంభిస్తారు. మోదీ, పుతిన్?లు వ్యక్తిగతంగా సన్నిహితులు అనే విషయం మీకు తెలుసు. వారు తమ సంబంధాల విషయంలో ఎంతో ఆచరణాత్మకంగా వ్యవహరిస్తారు. మన ఉమ్మడి ఎజెండాలోని, ద్వైపాక్షిక సంబంధాల్లోని అత్యంత సున్నితమైన అంశాలను కూడా బహిరంగంగా, నిర్మాణాత్మకంగా చర్చించగలిగేంత నిజాయితీ, నమ్మకం వారి మధ్య ఉన్నాయి. ఇది కచ్చితంగా మన మధ్య సహకారానికి సరికొత్త అవకాశాలను తెరుస్తుంది" అని పెస్కోవ్ అన్నారు. భారతదేశంలో కొత్త అణు విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయడంపై చర్చల కోసం రష్యా ఎదురుచూస్తోందని పెస్కోవ్ తెలిపారు. భారతదేశానికి సుఖోయ్?-57 యుద్ధవిమానాల విక్రయం కూడా తమ ఎజెండాలో ఉందని ఆయన వెల్లడించారు. కొన్ని దేశాలు తమ కరెన్సీలను రాజకీయ అణచివేతకు ఒక సాధనంగా వాడుకుంటున్నాయని ఆయన ఆరోపించారు.

సెప్టెంబర్‌లోనూ వర్షాల లోటే

సెప్టెంబర్ నెలలో వర్షాలు దేశవ్యాప్తంగా ఒకేలా ఉండే పరిస్థితి కనిపించడం లేదు. కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండగా, దక్షిణ భారతదేశంలో పలు ప్రాంతాల్లో మాత్రం వర్షాల తీవ్రత తక్కువగానే ఉంది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, కేరళలో ఇప్పటికే వర్షపాత లోటు కనిపిస్తోంది. మరోవైపు తెలంగాణలో రానున్న రోజుల్లో అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. తాజా అంచనాల ప్రకారం దక్షిణ ద్వీపకల్పంలో రాబోయే రోజుల్లో వర్షాల పరిస్థితి ప్రాంతాల వారీగా మారనుంది.

ఏపీలో 45 శాతం వర్షపాతం లోటు

జూన్ 1 నుంచి సెప్టెంబర్ 7 వరకు నమోదైన వర్షపాతాన్ని పరిశీలిస్తే, ఆంధ్రప్రదేశ్‌లో సాధారణం కంటే 45 శాతం తక్కువ వర్షం నమోదైంది. దేశంలోని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో అధిక వర్షపాత లోటు ఉన్న ప్రాంతాల్లో ఏపీ కూడా ఉంది. రానున్న రోజుల్లో కోస్తాంధ్ర, రాయలసీమలో అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశం ఉన్నప్పటికీ రాష్ట్రవ్యాప్తంగా విస్తారమైన వర్షాలు కురిసే పరిస్థితి ప్రస్తుతానికి లేదు. అయితే వాతావరణ పరిస్థితుల్లో కీలక మార్పు చోటుచేసుకునే అవకాశం ఉంది. సెప్టెంబర్ 11 ప్రాంతంలో వాయవ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతం, ఉత్తర ఆంధ్రప్రదేశ్-- దక్షిణ ఒడిశా తీరాల సమీపంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది.

తెలంగాణకు వరుసగా వర్ష సూచన

తెలంగాణలో రానున్న రోజుల్లో వర్షాల అవకాశాలు క్రమంగా పెరగనున్నాయి. ఐఎండీ తాజా బులెటిన్ ప్రకారం సెప్టెంబర్ 8, 9 తేదీల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉంది. సెప్టెంబర్ 10, 11 తేదీల్లో కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశముంది. ఆ తర్వాత 12 నుంచి 14 వరకు రాష్ట్రంలో చాలా ప్రాంతాల్లో వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. అంటే తెలంగాణలో వెంటనే భారీ వర్షాల పరిస్థితి కాకుండా, రానున్న రోజుల్లో వర్షాల విస్తృతి పెరిగే అవకాశం కనిపిస్తోంది.

తమిళనాడుకు భారీ వర్ష సూచన

దక్షిణాదిలో మరో ముఖ్యమైన మార్పు తమిళనాడులో కనిపించనుంది. సెప్టెంబర్ 8 నుంచి 14 వరకు తమిళనాడు, పుదుచ్చేరి, కారైకాల్‌లో అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశం ఉంది. ముఖ్యంగా సెప్టెంబర్ 11, 12 తేదీల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. రాయలసీమలో కూడా సెప్టెంబర్ 8 నుంచి 12 వరకు అక్కడక్కడా వర్షాలు పడే అవకాశం ఉంది. కోస్తాంధ్రలో సెప్టెంబర్ 8 నుంచి 14 వరకు చెదురుమదురు నుంచి కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది.

కేరళలోనూ లోటు

కేరళలో జూన్ నుంచి సెప్టెంబర్ 7 వరకు 24 శాతం వర్షపాతం లోటు నమోదైంది. రాబోయే రోజుల్లో మాత్రం కేరళ, మాహే ప్రాంతాల్లో కొన్ని దశల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. సెప్టెంబర్ 8, 9 తేదీలతో పాటు 13, 14 తేదీల్లోనూ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. అయితే కేరళలో కొన్ని ప్రాంతాల్లో వేడి, ఉక్కపోత పరిస్థితులు కూడా కొనసాగుతున్నాయి. అందువల్ల రాష్ట్రంలో వాతావరణం ప్రాంతాల వారీగా మారే అవకాశం ఉంది.

కర్ణాటకలోనూ మారనున్న వాతావరణం

ఉత్తర కర్ణాటకలో సెప్టెంబర్ 8 నుంచి 14 వరకు అక్కడక్కడా వర్షాలు పడే అవకాశం ఉంది. దక్షిణ కర్ణాటకలో సెప్టెంబర్ 10, 11 తేదీల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు, గరిష్ఠంగా 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. సెప్టెంబర్ 12 నుంచి 14 మధ్య దక్షిణ కర్ణాటకలోనూ వర్షాల విస్తృతి పెరగొచ్చని ఐఎండీ తెలిపింది. ప్రస్తుతం దేశంలోని వాతావరణ పరిస్థితులు ఒకే విధంగా లేవు. ఉత్తర, తూర్పు, ఈశాన్య ప్రాంతాల్లో కొన్ని చోట్ల భారీ వర్షాలకు అవకాశం ఉండగా, దక్షిణ ద్వీపకల్పంలో మాత్రం వర్షాలు ప్రాంతాల వారీగా మారుతున్నాయి. అందుకే వర్షపాతం లోటు ఉన్న రాష్ట్రాల్లో ఒక్కసారిగా భారీ వర్షాలు కురిసినా మొత్తం లోటు వెంటనే పూడిపోదు. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న 45 శాతం లోటు ఇందుకు ఉదాహరణ. తెలంగాణలో రాబోయే రోజుల్లో వర్షాల విస్తృతి పెరిగే అవకాశం ఉన్నా, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో ఒకే స్థాయిలో వర్షాలు పడతాయని చెప్పలేం.

వచ్చే ఏడాదే బుల్లెట్ రైలు పరుగులు

భారత్ సొంతంగా అభివృద్ధి చేస్తున్న తొలి బుల్లెట్ రైలు త్వరలో పట్టాలెక్కనుంది. వచ్చే ఏడాది మే లేదా జూన్‌లో ఈ రైలు ట్రయల్ రన్స్ ప్రారంభమవుతాయని కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. పరీక్షలు పూర్తైన రెండు నుంచి నాలుగు నెలల్లో వాణిజ్య సేవలు ప్రారంభించే అవకాశం ఉందన్నారు. వడోదరలో నిర్వహించిన 'నమో ఫర్ వికసిత్ భారత్' కార్యక్రమంలో మంత్రి ఈ వివరాలు వెల్లడించారు. దేశీయంగా తయారవుతున్న హైస్పీడ్ రైలు తొలి బాడీ ఫ్రేమ్ ఇటీవలే పూర్తయిందని చెప్పారు. ప్రస్తుతం దానిపై స్ట్రీజ్ టెస్టింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. "వచ్చే ఏడాది మే లేదా జూన్ నాటికి మన సొంత బుల్లెట్ రైలు ట్రయల్స్ కోసం పట్టాలపైకి వస్తుంది. రెండు నుంచి నాలుగు నెలల పరీక్షల తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రైలును ప్రారంభిస్తారు" అని వైష్ణవ్ చెప్పారు. ముంబై-అహ్మదాబాద్ బుల్లెట్ రైలు కారిడార్ పనులు వేగంగా సాగుతున్నాయని తెలిపారు. సూరత్-వాపి మార్గం ఈ ఏడాది డిసెంబరు నాటికి పూర్తయ్యే అవకాశం ఉందన్నారు. ఈ రైలు అందుబాటులోకి వస్తే వడోదర నుంచి ముంబైకి ప్రయాణ సమయం కేవలం గంటన్నర మాత్రమే ఉంటుందని చెప్పారు. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా దేశీయ బుల్లెట్ రైలు ప్రాజెక్టును అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. రైల్వే రంగంలో ఆపరేటింగ్, రిజర్వేషన్ వ్యవస్థలతో పాటు నిర్మాణ విధానాలను ఆధునికీకరిస్తున్నామని చెప్పారు. దేశవ్యాప్తంగా 280 రైల్వే స్టేషన్లను పునరాభివృద్ధి చేసినట్లు వైష్ణవ్ తెలిపారు. కొత్తగా 36 వేల కిలోమీటర్ల రైల్వే ట్రాక్‌లు వేశామని చెప్పారు. వందే భారత్ సాంకేతికతతో కార్గో రైళ్లను కూడా అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. చినాబ్ వంతెన, మిజోరాంను జాతీయ రైల్వే నెట్‌వర్క్‌తో అనుసంధానించే ప్రాజెక్టు వంటి దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తయ్యాయని తెలిపారు. కొవిడ్ సవాళ్లు ఉన్నప్పటికీ రైల్వే మౌలిక వసతుల అభివృద్ధి వేగం పెరిగిందన్నారు.

వాయు కాలుష్యంపై కేంద్రం సర్వే

దేశవ్యాప్తంగా తీవ్ర వాయు కాలుష్యంతో సతమతమవుతున్న ఢిల్లీ, కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన 'స్వచ్ఛ వాయు సర్వేక్

సంపూర్ణ అక్షరాస్యత లక్ష్యంతో అక్షరాంధ్ర

99 శాతం అక్షరాస్యత సాధించాం..
మిగిలిన వారినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దుతాం
డిజిటల్ అక్షరాస్యతపైనా ప్రత్యేక దృష్టి
జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



విజయవాడ, మహానగర్

జిల్లాను శతశాతం అక్షరాస్యత సాధించిన జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం, విద్యాశాఖ, సంబంధిత శాఖలు సమన్వయంతో కృషి చేస్తున్నాయని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. జిల్లా వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని కె.బి.ఎన్. కళాశాలలో 60వ అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ సామూహిక వందేమాతరం గీతాలాపనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్షరాస్యత అంటే కేవలం చదవడం, రాయడం నేర్చుకోవడం మాత్రమే కాదని, వ్యక్తి సామాజిక, ఆర్థిక, సాంకేతిక అభివృద్ధికి కీలక సాధనమని పేర్కొన్నారు. 'అక్షరాంధ్ర' కార్యక్రమంలో భాగంగా 2025--26లో 97,047 మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దే లక్ష్యానికి 96,686 మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్ది 99 శాతం అక్షరాస్యత సాధించినట్లు తెలిపారు. 2026--27 సంవత్సరానికి 88,890 మంది నమోదు లక్ష్యాన్ని పూర్తి చేసినట్లు వెల్లడించారు. మిగిలిన వారిని కూడా అక్షరాస్యులుగా తీర్చిదిద్ది జిల్లాను శతశాతం అక్షరాస్యత దిశగా తీసుకెళ్లేందుకు నిరంతర కృషి కొనసాగుతుందని చెప్పారు. అక్షరాస్యత కార్యక్రమాల విజయవంతమైన అమలుకు క్షేత్రస్థాయి సిబ్బంది, విద్యాశాఖ, వయోజన విద్యా విభాగం, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, సమాజంలోని వివిధ వర్గాల భాగస్వామ్యం అవసరమన్నారు. ప్రస్తుత సాంకేతిక యుగంలో సాధారణ అక్షరాస్యతతో పాటు డిజిటల్ అక్షరాస్యత కూడా ప్రతి ఒక్కరికీ అవసరమని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, డిజిటల్ సేవలు, ఆన్‌లైన్ లావాదేవీలు, సమాచార సాంకేతికతను సద్వినియోగం చేసుకునేందుకు డిజిటల్ పరిజ్ఞానం ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రతి కుటుంబంలో కనీసం ఒకరు డిజిటల్ పరిజ్ఞానం కలిగి ఉండేలా అవగాహన కల్పించాలని సూచించారు. 'అక్షరాస్యత ప్రాముఖ్యత--ప్రతి ఒక్కరి బాధ్యత' అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో, 'డిజిటల్ యుగంలో డిజిటల్ అక్షరాస్యత' అంశంపై నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో విజేతలకు కలెక్టర్ బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. అక్షరాస్యత ప్రాముఖ్యతను సమాజంలో విస్తృతంగా ప్రచారం చేయడంలో విద్యార్థులు కూడా భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది, విద్యార్థులు అక్షరాస్యత ఉద్యమ ప్రతిజ్ఞ చేశారు. జిల్లాలో నిరక్షరాస్యులను గుర్తించి వారికి అక్షరాస్యత అందించేందుకు ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించాలని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.చంద్రకళ, ఐసీడీఎస్ పీడీ ఎస్.కె.రుక్సానా, వయోజన విద్యాశాఖ డీడీ జి.ప్రభాకర్, ఏ.డీ. హాజీ బేగ్, సీడీఓ శ్రీకాంత్, హెచ్ఎం హనుమంతరావు, అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ జి.ప్రసాదరావు, ఎం.సింగయ్య, కళాశాల వైస్ ప్రిన్సిపాల్, అధికారులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారంలో జాప్యం వద్దు

బాధితులకు పరిహారం త్వరితగతిన అందేలా చర్యలు
సున్నిత ప్రాంతాల్లో కాన్ఫిడెన్స్ బిల్డింగ్ చర్యలు చేపట్టాలి
జిల్లా కలెక్టర్ డీకే బాలాజి



మచిలీపట్నం, మహానగర్

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, బాధితులకు చట్టప్రకారం అందాల్సిన పరిహారాన్ని సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి అధికారులను ఆదేశించారు. ప్రక్రియాపరమైన కారణాలతో కేసుల పరిష్కారంలో జాప్యం జరగకుండా చూడాలని స్పష్టం చేశారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పురోగతి, దర్యాప్తు, చార్జిషీట్ల దాఖలు, పరిహారం చెల్లింపులు, పెండింగ్ కేసులు, బాధితుల సమస్యలపై సమీక్షించారు. 2025 జనవరి 1 నుంచి 2026 ఆగస్టు 31 వరకు ఎస్సీ, ఎస్టీ (పీ.ఓ.ఏ.) చట్టం కింద 79 మంది బాధితులకు సంబంధించిన కేసులు నమోదైనట్లు అధికారులు తెలిపారు. బాధితులకు పరిహారం కింద రూ.1,30,33,750 మంజూరవగా, ప్రభుత్వం నుంచి రూ.86.28 లక్షల బడ్జెట్ విడుదలై 44 మంది బాధితులకు రూ.86,10,482 చెల్లించినట్లు వివరించారు. మరో 35 మంది బాధితులకు రూ.44,23,268 పరిహారం చెల్లించాల్సి ఉందని, అదనపు నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. మండలాల వారీగా పరిశీలించగా బందరు డివిజన్‌లో 30 కేసులు, 36 మంది బాధితులు, గుడివాడ డివిజన్‌లో 19 కేసులు, 22 మంది బాధితులు, ఉయ్యూరు డివిజన్‌లో 17 కేసులు, 21 మంది బాధితులు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. పెండింగ్‌లో ఉన్న 35 మంది బాధితులకు పరిహారం త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని, భవిష్యత్‌లో జాప్యం లేకుండా అవసరమైన నిధుల కోసం ముందస్తు ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ ఆదేశించారు. పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి దర్యాప్తు పూర్తి చేయాలని, ఎఫ్ఎస్ఎల్ నివేదికలు, ధ్రువపత్రాలు, కుల ధ్రువీకరణ పత్రాల ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. కేసుల నమోదు, దర్యాప్తు, చార్జిషీట్ల దాఖలుకు నిర్దేశిత గడువులను తప్పనిసరిగా పాటించాలన్నారు. సున్నిత ప్రాంతాల్లో ఎస్సీ, ఎస్టీ వర్గాల కుటుంబాలు భయాందోళనలకు గురికాకుండా పోలీసు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా కాన్ఫిడెన్స్ బిల్డింగ్ చర్యలు చేపట్టాలని తెలిపారు. అవసరమైన ప్రాంతాలను డీఎస్పీ, ఆర్డీఓ, తహసీల్దార్, ఎస్‌హెచ్‌ఓలు కలిసి సందర్శించి బాధితులతో మాట్లాడి సమస్యలు తెలుసుకోవాలని సూచించారు. జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో చట్టప్రకారం చర్యలు తీసుకుంటున్నామని, బాధితుల భద్రతకు పోలీసుశాఖ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. సున్నిత ప్రాంతాల్లో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చోట ముందస్తు చర్యలు చేపడతామన్నారు. అట్రాసిటీ చట్టం కింద వచ్చే ఫిర్యాదులపై అధికారులు సున్నితంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, ఫిర్యాదు అందిన వెంటనే ప్రాథమిక వాస్తవాలు, సంఘటన సమయం, సంబంధిత వ్యక్తుల ఉనికి, ఆధారాలు, తటస్థ సాక్షుల వివరాలను పరిశీలించాలని సూచించారు. నిజమైన కేసుల్లో జాప్యం లేకుండా కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, సాధారణ స్థానిక వివాదాలను అనవసరంగా పెద్ద సమస్యలుగా మార్చకుండా వివేకంతో వ్యవహరించాలని తెలిపారు. చట్టాన్ని సమర్థంగా అమలు చేయడంతోపాటు సామాజిక సామరస్యాన్ని కాపాడటం కూడా ముఖ్యమన్నారు. సంచార జీవన విధానం కారణంగా ఎస్టీ వర్గాలకు చెందిన యానాది కుటుంబాలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందడంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులపై కూడా సమావేశంలో చర్చించారు. వారు స్థిర నివాసం ఏర్పరచుకునేలా సంఘ నాయకులు సహకరించాలని కలెక్టర్ సూచించారు. అర్హులైన కుటుంబాలకు గృహ వసతి, ఆధార్, రేషన్ కార్డు, పెన్షన్, ఇతర సంక్షేమ పథకాలు అందేలా శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఆధార్ కార్డులు లేని లేదా కోల్పోయిన వారికి ప్రత్యేక చర్యల ద్వారా ఆధార్ సేవలు అందించాలని సూచించారు. కమిటీ సభ్యులు దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు, డీఆర్వో కే.శ్రీధర్‌రెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు షేక్ షాహిద్ బాబు, మచిలీపట్నం, గుడివాడ, ఉయ్యూరు ఆర్డీఓలు కే.సాంబశివరావు, జి.బాలసుబ్రమణ్యం, ఎస్.కరుణకుమారి, గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఫణి ధూర్జటి, డీఎస్పీలు ఏ.శ్రీనివాసరావు, కే.ధర్మేంద్ర, పాల శ్రీనివాస్, ఎస్బీ సీఐ సత్యకిషోర్, కమిటీ సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇండియన్ సాఫ్ట్‌బాల్ క్రికెట్ లీగ్ సీజన్-2 ప్రారంభం

హైదరాబాద్, మహానగర్



దేశంలో సాఫ్ట్‌బాల్ క్రికెట్‌కు మరింత ప్రాచుర్యం కల్పించడంతోపాటు యువ ఆటగాళ్లకు విస్తృత అవకాశాలు కల్పించే లక్ష్యంతో 'ఇండియన్ సాఫ్ట్‌బాల్ క్రికెట్ లీగ్' రెండో సీజన్ ప్రారంభమైంది. ఈసారి తొలి సీజన్ కంటే దాదాపు మూడు రెట్లు పెద్ద స్థాయిలో పోటీలు జరగనున్నాయి. మొత్తం 32 జట్లు బరిలోకి దిగనుండగా 127 మ్యాచ్‌లను నిర్వహించనున్నారు. మాజీ క్రికెట్ దిగ్గజాలు హర్భజన్ సింగ్, సురేష్ రైనా లీగ్‌కు బ్రాండ్ అంబాసిడర్లుగా వ్యవహరిస్తున్నారు. లీగ్‌ను దేశంతోపాటు అంతర్జాతీయ ప్రేక్షకులకు చేరువ చేసేందుకు సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్, స్క్రీనాక్స్, మైఆసియా సంస్థలు భాగస్వాములుగా చేరాయి. ఇండియన్ సాఫ్ట్‌బాల్ క్రికెట్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గంగాధర్ రాజు మాట్లాడుతూ రెండేళ్ల క్రితం ఈ క్రీడకు గుర్తింపు తీసుకురావాలనే ప్రయత్నం ప్రారంభించామని, ఇప్పుడు 32 జట్ల స్థాయికి చేరుకోవడం సంతోషంగా ఉందన్నారు. ముఖ్యంగా చిన్న పట్టణాలకు చెందిన ఆటగాళ్లు పెద్ద సంఖ్యలో లీగ్‌లో చోటు దక్కించుకోవడం సీజన్-2లో విశేషమని తెలిపారు. హర్భజన్ సింగ్ మాట్లాడుతూ లీగ్ విస్తరించిన కొద్దీ యువ ప్రతిభకు గుర్తింపు పొందే అవకాశాలు కూడా పెరుగుతాయని అన్నారు. సోనీ స్పోర్ట్స్ ఏవీపీ కౌశిక్ కల్లూరి మాట్లాడుతూ కింది స్థాయి నుంచి వచ్చిన ఆటగాళ్లకు జాతీయ వేదికపై తమ సామర్థ్యాన్ని నిరూపించుకునే అవకాశం ఈ లీగ్ కల్పిస్తోందన్నారు. సాఫ్ట్‌బాల్ క్రికెట్‌ను మరింత మంది ప్రేక్షకులకు పరిచయం చేయడంలో తమ భాగస్వామ్యం ఉపయోగపడుతుందని చెప్పారు. మైఆసియా ప్రతినిధి నూరుల్ అమీన్ ఈ భాగస్వామ్యం ఒక్క సీజన్‌కే పరిమితం కాదని, దేశంలో సాఫ్ట్‌బాల్ క్రికెట్ అభివృద్ధికి దీర్ఘకాలిక పెట్టుబడిగా కొనసాగుతుందని తెలిపారు. సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్ అధికారిక ప్రసార భాగస్వామిగా, స్క్రీనాక్స్ దేశవ్యాప్తంగా 1,500కు పైగా స్క్రీన్లలో మ్యాచ్‌లను ప్రదర్శించే అధికారిక స్క్రీనింగ్ భాగస్వామిగా వ్యవహరించనున్నాయి. లీగ్‌ను అంతర్జాతీయ స్థాయికి విస్తరించడంతోపాటు వాణిజ్యపరమైన క్రీడా ప్రాపర్టీగా అభివృద్ధి చేసే బాధ్యతతో మైఆసియా వ్యూహాత్మక భాగస్వామిగా వ్యవహరిస్తోంది. కార్యక్రమంలో మాజీ ఐఏఎస్ అధికారి, లీగ్ చైర్మన్ బీహెచ్ అనిల్‌కుమార్, వైస్ చైర్మన్ సంజీవ్ సింగ్ పాల్గొన్నారు.

ఐసీఐసీఐ లైఫ్ పార్ట్నర్ స్టాక్ 2.0ను ఆవిష్కరించిన ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్

ICICI PRUDENTIAL LIFE INSURANCE
Ke Saath Zimmedari Lagey Pyaari
Trusted by over 20 crore Indians in 25 YEARS

విజయవాడ

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ తమ పార్ట్నర్ స్టాక్‌కు మరిన్ని సామర్థ్యాలను జోడించి 'ఐసీఐసీఐ లైఫ్ పార్ట్నర్ స్టాక్ 2.0'ను ఆవిష్కరించింది. ఏఐ ఆధారిత టూల్స్, భాగస్వాములు-సిస్టమ్స్ మధ్య విస్తృత అనుసంధానతతో పాటు సేల్స్, ఆన్‌బోర్డింగ్, కస్టమర్ సర్వీసింగ్‌లో డిజిటల్ సామర్థ్యాలను ఇందులో పొందుపర్చింది. ఈకోట్ యాప్ కస్టమర్ సెగ్మెంట్, జీవిత దశ ఆధారంగా తగిన ప్రోడక్టులను సిఫార్సు చేయడంతో పాటు వ్యక్తిగతీకరించిన కొటేషన్లను రూపొందించేందుకు అడ్వైజర్లకు సహాయపడుతుంది. లివా ఏఐ చాట్‌బాట్ ద్వారా ప్రోడక్ట్ ఫీచర్లు, కొటేషన్లను యాక్సెస్ చేసుకునే అవకాశం ఉంటుంది. పార్ట్నర్ సీఆర్ఎం ప్లాట్‌ఫాంలతో అనుసంధానం, ఏపీఐ సర్వీసుల ద్వారా కస్టమర్ సర్వీస్ రిక్వెస్టులను డిజిటల్‌గా నిర్వహించవచ్చు. ఆధార్, సీకేవైసీ, వాహన్, జీఎస్టీఎన్, ఈపీఎఫ్ఓ, సీఏఎస్, పెర్ఫియోస్ వంటి డేటాబేస్‌ల అనుసంధానంతో అప్లికేషన్‌లో దాదాపు 70 శాతం వివరాలు ప్రీ-ఫిల్ అవుతాయి. ఏఎస్బీఏ, వాట్సాప్ ఆధారిత చెల్లింపులతో ప్రీమియం చెల్లింపు సౌలభ్యం కల్పించింది. ఏఐ ఆధారిత ప్రీ-ఇష్యూయెన్స్ వీడియో వెరిఫికేషన్ రిస్క్, మోసాలను గుర్తించడంలో తోడ్పడుతుంది. 200కు పైగా పార్ట్నర్-సిస్టమ్ ఇంటిగ్రేషన్స్, 99 శాతం డిజిటల్ బిజినెస్ అప్లికేషన్లతో సంస్థ డిజిటల్ సామర్థ్యాలను విస్తరించింది.

వేడుకగా శ్రీరామ షిర్డీ సాయి మందిరం 18వ వార్షికోత్సవం



మోపిదేవి, మహానగర్

మండల పరిధిలోని పెదప్రోలు గ్రామంలోని శ్రీరామ షిర్డీ సాయి మందిరం 18వ వార్షికోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా షిర్డీ సాయిబాబాకు అభిషేకాలు, హారతులు తదితర పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చల్లపల్లి సీఐ కే.ఈశ్వరరావు, మోపిదేవి ఎస్ఐ పామర్తి గౌతమ్‌కుమార్, చల్లపల్లి ఎస్ఐ దుర్గాంజనేయులు తదితరులు సాయిబాబాను దర్శించుకుని పూజలు నిర్వహించారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన అన్నసమారాధనను సీఐ ఈశ్వరరావు ప్రారంభించారు. వార్షికోత్సవ కార్యక్రమాల వివరాలను కూరపాటి కోటేశ్వరరావు వెల్లడించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరరావు, యడ్ల శేషు, యడ్లపల్లి రాజేశ్వరరావు (రాజా), కొసరాజు కోమలి, బావిరెడ్డి వెంకటేశ్వరరావు, ఆది రాంబాబు, దివి మోహనబాబు, తుంగల బుజ్జి, గౌరం హర్షవర్ధన్, మోర్ల చిదంబరరావు, వాకా స్వామి, యన్నం నరేంద్రతో పాటు పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు.

గోశాలలోని ఆవుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

మోపిదేవి, మహానగర్



శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానంలోని గోశాలలోని గోవులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల కార్యనిర్వహణాధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. గ్రామంలో వెలసి ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోశాలలోని సుమారు 15 ఆవు దూడలకు ముందుజాగ్రత్త చర్యగా బూస్టర్ డోస్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. గోశాలలోని గోవులు ఆరోగ్యంగా ఉండి, అంటువ్యాధులు, ఇతర వ్యాధుల బారిన పడకుండా రక్షణ కల్పించే ఉద్దేశంతో పశుసంవర్ధక శాఖ వైద్యుల సలహాల మేరకు లంపీ స్కిన్ వ్యాధి - ముద్ద రోగం నివారణకు వ్యాక్సిన్‌తో పాటు అవసరమైన నివారణ మందులను అందించి గోవులకు టీకాలు వేశారు. డీఏహెచ్ఓ డాక్టర్ మంగు శ్రీనివాసరావు, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాస్ రెడ్డి, చల్లపల్లి, మోపిదేవి మండల పశువైద్యాధికారి డాక్టర్ నందకిషోర్ ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. పశుసంవర్ధక శాఖ వెటర్నరీ సిబ్బంది, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

బొప్పాయి తోటల్లో వైరస్ నిర్మూలన చర్యలు చేపట్టాలి

- ఉద్యానవన శాఖ అధికారి ఎన్.రమేష్

మోపిదేవి, మహానగర్



బొప్పాయి తోటల్లో వైరస్ నిర్మూలన చర్యలు చేపట్టాలని ఉద్యానవన శాఖ అధికారి ఎన్.రమేష్ సూచించారు. మండలంలోని కోసూరివారి పాలెం, నాగాయతిప్పల్లో బొప్పాయి తోటలను మంగళవారం ఆయన పరిశీలించారు. వైరస్ నియంత్రణకు బొప్పాయి నారును ఇమిడా క్లాప్రిడ్ 5 గ్రాములు, కార్బెండజిమ్ 3 గ్రాములు లీటరు నీటికి కలిపి విత్తన శుద్ధి చేయాలన్నారు. రసం పీల్చే పురుగుల ద్వారా వైరస్ వ్యాప్తి చెందుతుంది కాబట్టి లీటర్ నీటిలో ఎసిఫేట్ 1.5 గ్రాములు కలిపి పిచికారి చేయాలన్నారు. 10 రోజుల తర్వాత లీటరు నీటిలో ఇమిడా క్లోప్రిడ్ ఒక ఎంఎల్ కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. దిగుబడి సమృద్ధిగా పెరిగేందుకు, వైరస్ సోకిన మొక్కలకు కాయల నాణ్యత పెంచేందుకు 10 గ్రాముల యూరియా, 1.5 గ్రాముల జింక్ సల్ఫేట్, ఒక గ్రాము బోరాన్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. 30 రోజుల వ్యవధిలో 8 నెలలు వరకు మొక్కలకు పిచికారీ చేసుకోవాలని సూచించారు.

రిలయన్స్ భారీ ప్లాన్

మూడేళ్ల తర్వాత బాండ్ మార్కెట్‌లోకి!



ముఖేష్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ దాదాపు మూడేళ్ల తర్వాత.. మళ్లీ ఇండియా రుపీ బాండ్ మార్కెట్‌లోకి అడుగుపెట్టేందుకు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగానే.. కంపెనీ భారీ మొత్తంలో నిధులను సమీకరించేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఈ బాండ్ ఇష్యూ పూర్తయితే, 2023 నవంబర్ తర్వాత ఒక రేటెడ్ కంపెనీ చేపట్టే అతిపెద్ద సింగిల్-ట్రాంచ్ ఫండ్ రైజింగ్‌గా నిలిచే అవకాశం ఉంది.

రూ.12,500 కోట్ల సమీకరణ

రిలయన్స్ ఇండస్ట్రీస్ సుమారు రూ.12,500 కోట్లను సమీకరించాలని చూస్తోంది. ఇందుకోసం ఐదేళ్ల కాలపరిమితి ఉన్న బాండ్లను జారీ చేయనుంది. ఈ బాండ్లపై ఏడాదికి 7.47 శాతం వడ్డీ చెల్లించే అవకాశం ఉంది. ఇన్వెస్టర్ల నుంచి బిడ్లను సెప్టెంబర్ 18తో ముగిసే వారంలో ఆహ్వానించే అవకాశం ఉందని సమాచారం.

2023 తర్వాత తొలిసారి

రిలయన్స్ ఇండస్ట్రీస్ చివరిసారిగా 2023 నవంబర్‌లో దేశీయ రూపాయి బాండ్ మార్కెట్ ద్వారా నిధులు సమీకరించింది. అప్పుడు కంపెనీ ఏకంగా రూ.20,000 కోట్లను సమీకరించింది. దీంతో ఇది భారతదేశంలో నాన్-ఫైనాన్షియల్ కంపెనీ చేపట్టిన అతిపెద్ద లోకల్ కరెన్సీ డెట్ ఇష్యూగా నిలిచింది. ఇప్పుడు మరోసారి భారీ మొత్తంలో నిధులు సమీకరించేందుకు రిలయన్స్ సిద్ధమవుతుండటం మార్కెట్‌లో ఆసక్తిని పెంచుతోంది.

రూపాయి బాండ్ల వైపు ఎందుకు?

ప్రస్తుతం భారత్‌లో ఐదేళ్ల వరకు ఉన్న బాండ్లపై వడ్డీ రేట్లు గణనీయంగా తగ్గాయి. దీంతో డాలర్లలో రుణాలు తీసుకోవడం కంటే రూపాయిల్లో బాండ్లు జారీ చేసి నిధులు సమీకరించడం కంపెనీలకు చౌకగా మారింది. జూన్ ప్రారంభం నుంచి ఐదేళ్ల ప్రభుత్వ బాండ్ రాబడి దాదాపు 33 బేసిస్ పాయింట్లు తగ్గింది. దీనికి ప్రధాన కారణాల్లో ఒకటి దేశంలోకి వచ్చిన భారీ డాలర్ ప్రవాహాలు. అదే సమయంలో అమెరికా ట్రెజరీ బాండ్లపై వడ్డీ రేట్లు పెరగడంతో డాలర్లలో రుణాలు తీసుకోవడం భారతీయ కంపెనీలకు మరింత ఖరీదుగా మారింది. ఈ పరిస్థితి కూడా రిలయన్స్ వంటి సంస్థలను దేశీయ బాండ్ మార్కెట్ వైపు ఆకర్షిస్తోంది.

10 ఏళ్ల బాండ్స్

ఈ బాండ్ ఇష్యూకు కొన్ని పెద్ద ప్రైవేట్ బ్యాంకులు అరేంజర్లుగా వ్యవహరించనున్నాయి. అంతేకాకుండా.. ఈ బాండ్లలో కొంత భాగాన్ని ఆ బ్యాంకులే కొనుగోలు చేసే అవకాశం కూడా ఉందని సమాచారం. ఐదేళ్ల బాండ్లతో పాటు 10 ఏళ్ల కాలపరిమితి ఉన్న బాండ్లను కూడా జారీ చేయాలా అనే విషయంపై రిలయన్స్ ఆలోచిస్తోంది. ఇందుకోసం బ్యాంకర్లు, ఇన్వెస్టర్లతో కంపెనీ చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది.

ఈవీ అమ్మకాల జోరు.. 2.98 లక్షల యూనిట్లు విక్రయం

ఇంటర్నెట్ డెస్క్: దేశంలో ఎలక్ట్రిక్ వాహన విక్రయాల జోరు పెరిగింది ఆగస్టులో మొత్తం 2.98 లక్షల ఈవీలు అమ్ముడయ్యాయి. గతేడాదితో పోలిస్తే 52.9 శాతం వృద్ధి నమోదు చేశాయి. మొత్తంగా మార్కెట్ వాటా 9.5 శాతం నుంచి 12.3 శాతానికి పెరిగిందని ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్ (ఫాడా) వెల్లడించింది.

ఎలక్ట్రిక్ టూవీలర్ సెగ్మెంట్‌లో 1,83,204 వాహనాలు విక్రయమయ్యాయి. గతేడాది నమోదైన 1,09,673 యూనిట్లతో పోలిస్తే 67.05 శాతం పెరిగాయి. కానీ జులైతో పోలిస్తే 10.37 శాతం తగ్గుముఖం పట్టాయి.

ఎలక్ట్రిక్ ప్యాసింజర్ రిటైయిల్ వాహనాలు గతేడాదితో పోలిస్తే 51.89 శాతం వృద్ధితో 30,696 యూనిట్లు సేల్ అయ్యాయి. జులైతో పోలిస్తే 6.78 శాతం తగ్గాయి.

త్రీ వీలర్ సెగ్మెంట్‌లో రిటైల్ విక్రయాలు 79,846 యూనిట్లకు చేరాయి. గతేడాదితో పోలిస్తే 25.28శాతం వృద్ధి చెందగా, జులైతో పోలిస్తే 8.28 శాతం తక్కువ.

ఎలక్ట్రిక్ కమర్షియల్ వాహనాల రిటైల్ విక్రయాలు దాదాపు మూడింతలు అయ్యాయి. గతేడాదితో పోలిస్తే 188.3 శాతం వృద్ధితో 4,702 యూనిట్లు అమ్ముడయ్యాయి. జులైతో పోలిస్తే 32.23 శాతం పెరుగుదల సాధించింది.



కోల్ గ్యాసిఫికేషన్ స్కీమ్‌కు అదానీ, ఎన్‌టీపీసీ నుంచి దరఖాస్తులు

ఇంటర్నెట్ డెస్క్: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన కోల్ గ్యాసిఫికేషన్ స్కీమ్‌కు ఆదరణ లభించింది రూ.37,500 కోట్ల ప్రోత్సాహక ప్రాజెక్టుకు అదానీ ఎంటర్‌ప్రైజెస్, ఎన్టీపీసీ తాల్చేర్ ఫెర్టిలైజర్స్ వంటి సంస్థలు దరఖాస్తు సమర్పించాయి. యూరియా తయారీ కోసం అదానీ ఎంటర్‌ప్రైజెస్ మూడు ప్రతిపాదనలు చేసినట్లు కేంద్ర బొగ్గు గనుల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. మొత్తం 7 దరఖాస్తులు రాగా.. అందులో యూరియా ప్రాజెక్టుకు అదానీ గ్రూపు దరఖాస్తు చేసుకున్నట్లు కేంద్రం తెలిపింది. సింథటిక్ నేచురల్ గ్యాస్‌కు-ఎన్‌టీపీసీ, సింథసిస్ గ్యాస్‌కు శ్యామ్ సెల్ ఉ పవర్ వంటి కంపెనీలు దరఖాస్తులు సమర్పించాయి. మొదటి దరఖాస్తుల విండో సెప్టెంబర్ 7న ముగియగా.. సెప్టెంబర్ 8 నుంచి రెండో దశ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. ఇంధన అవసరాలకు దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించుకునేందుకు, దేశీయ బొగ్గు నిల్వలను సమర్థవంతంగా వినియోగించాలని కోల్ గ్యాసిఫికేషన్ ప్రక్రియకు కేంద్రం సంకల్పించింది. రూ.37,500 కోట్ల ప్రోత్సాహక పథకానికి మే నెలలో ప్రధాని మోదీ నేతృత్వంలోని క్యాబినెట్ ఆమోద ముద్ర వేసిన విషయం తెలిసిందే.

బిజినెస్

నేడే యాపిల్ ఈవెంట్..
ఫోల్డబుల్ ఐఫోన్, ఐఫోన్ 18 ప్రో విడుదల



యాపిల్ బ్రాండ్ లవర్స్ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న యాపిల్ ఈవెంట్ సెప్టెంబర్ 9, బుధవారం జరగనుంది. అమెరికా (క్యాలిఫోర్నియా)లోని యాపిల్ పార్క్‌లో ఈవెంట్ జరగనుంది. యాపిల్ మోస్ట్ అవైటెడ్ ఫోల్డబుల్ ఫోన్ ఈ ఈవెంట్‌లోనే రిలీజ్ కానుంది. ఇప్పటికే సాంసంగ్, మోటా వంటి అనేక సంస్థలు ఫోల్డబుల్ ఫోన్లు రిలీజ్ చేశాయి. కానీ, టాప్ బ్రాండ్ యాపిల్ మాత్రం తన ఫోల్డబుల్ తీసుకురావడానికి ఇంతకాలం పట్టింది. దీంతో బుధవారం రిలీజ్ కానున్న యాపిల్ ఫోన్ ఎలా ఉంటుందా అనే అంచనాలు పెరిగిపోతున్నాయి. ఫోల్డబుల్ ఫోన్‌తోపాటు ఐఫోన్ 18ప్రో, ఐఫోన్ 18 ప్రో మ్యాక్స్ ఫోన్లు కూడా బుధవారమే విడుదల కానున్నాయి. వీటితోపాటు యాపిల్ వాచ్ కూడా రిలీజవనుంది. యాపిల్ వాచ్ 12 పేరుతో ఈ స్మార్ట్‌వాచ్ రిలీజ్ కానుంది. అలాగే, ఎయిర్‌పాడ్స్ వెర్షన్ 5 కూడా రిలీజయ్యే ఛాన్స్ ఉంది. అయితే, వీటి విడుదలపై అధికారిక ప్రకటన మాత్రం లేదు. ఈవెంట్ తర్వాతే రిలీజవుతున్న డివైజెస్‌పై క్లారిటీ వస్తుంది. అందుకే, యాపిల్ లవర్స్ దీనికోసం ఎదురు చూస్తున్నారు. ఈ ఈవెంట్‌లో యాపిల్ నూతన సీఈవో జాన్ టెర్నస్ హాజరుకానున్నారు. ఆయన ఈవెంట్‌లో పాల్గొనడం ఇదే తొలిసారి. ప్రస్తుతం చిప్స్ ధరలు పెరిగిన నేపథ్యంలో ఈ ఫోన్లు, ఇతర డివైజెస్ రేట్లు అధికంగానే ఉండే ఛాన్స్ ఉంది. ఈ ఈవెంట్‌కు యాపిల్ మాజీ సీఈవో టిమ్ కుక్ కూడా హాజరయ్యే అవకాశాలున్నాయి. ఆయన ఈ నెల 1న సీఈవో నుంచి ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా మారిన సంగతి తెలిసిందే. దీంతో ఇద్దరిలో ఎవరు కొత్త ఫోన్స్ లాంఛ్ చేస్తారో అనే ఉత్కంఠ నెలకొంది.

తిలక్ అజేయ అర్ధ శతకం.. ఫైనల్లో ఎదురీదుతున్న సౌత్





దులీప్ ట్రోఫీ ఫైనల్లో ఈస్ట్ జోన్ పట్టుబిగించగా.. సౌత్ జోన్ ఎదురీదుతోంది. చిదంబరం స్టేడియంలో ఈస్ట్ బౌలర్ల ధాటికి ఓపెనర్లు తేలిపోగా దేవ్‌దత్ పడిక్కల్(62) అర్ధ శతకంతో మెరిశాడు. మహమ్మద్ షమీ(2-17), ముకేశ్ కుమార్(2-36)లు ఆరంభంలోనే దెబ్బకొట్టినా.. పడిక్కల్, కెప్టెన్ తిలక్ వర్మ(56 నాటౌట్) నిలబడడంతో ఈస్ట్ కాస్త కోలుకుంది. మూడో రోజు ఆట ముగిసే సరికి ఆరు వికెట్లు కోల్పోయిన సౌత్ 466 పరుగులు వెనకబడి ఉంది. ఈస్ట్ జోన్‌తో జరుగుతున్న దులీప్ ట్రోఫీ ఫైనల్లో సౌత్ జోన్ తడబడుతోంది. చిదంబరం స్టేడియంలో ఇషాన్ కిషన్(270) రికార్డు డబుల్ సెంచరీతో భారీ స్కోరందించగా.. ఈస్ట్ బౌలర్లు ముకేశ్ కుమార్(2-36), మహమ్మద్ షమీ(2-17)లు ఆదిలోనే సౌత్‌ను తీసి దెబ్బతీశారు. మూడో రోజు తొలి సెషన్‌లోనే రికీ భుయి(1)ని ముకేశ్ పెవిలియన్ పంపగా.. మరో ఓపెనర్ నారాయణ్ జగదీశన్(32)ను శిఖర్ మోహన్ ఔట్ చేశాడు. అంతే.. 70 పరుగులకే రెండు వికెట్లు పడ్డాయి. ఓపెనర్లు విఫలమైనా దేవదత్ పడిక్కల్ (62) అర్ధ శతకంతో మెరిశాడు.

తిలక్ నిలబడ్డాడు..

శ్రీలంక పర్యటనలో సెంచరీలతో చెలరేగిన ఈ లెఫ్ట్ హ్యాండర్ ఈస్ట్ బౌలర్లను ధీటుగా ఎదుర్కొని స్కోర్ బోర్డును నడిపించాడు. అయితే.. అతడిని ముకేశ్ వెనక్కి పంపి రెండో వికెట్ సాధించాడు. ఆపై షేక్ రషీద్(27), స్మరణ్ రవిచంద్రన్(23)లను షమీ బోల్తా కొట్టించాడు. అంతే.. 174కే ఈస్ట్ సగం వికెట్లు కోల్పోయింది. ఆ దశలో కెప్టెన్ తిలక్ వర్మ(56 నాటౌట్), శ్రేయాస్ గోపాల్(26)లు కీలక భాగస్వామ్యంతో ఆదుకున్నారు. టీ సెషన్‌లో నింపాదిగా ఆడిన వీరు ఆరో వికెట్‌కు 70కి పైగా రన్స్ జోడించారు. అయితే.. గోపాల్‌ను ఖరేషి ఔట్ చేసి సౌత్‌కు షాకిచ్చాడు. అయినా సరే తిలక్ మరో వికెట్ పడకుండా ఆచితూచి ఆడాడు. దాంతో, మూడో రోజు ఆట ముగిసే సరికి సౌత్ ఆరు వికెట్ల నష్టానికి 242 పరుగులు చేసింది. ఇంకా తొలి ఇన్నింగ్స్‌లో 466 పరుగులు వెనకబడి ఉంది. మరొక్క రోజే ఆట మిగిలి ఉండడంతో ఈస్ట్ జోన్ టైటిల్‌ను ముద్దాడడం లాంఛనమే.

కాషాయం కథ ముగిసె.. ఆసియాడ్‌లో నీలం జెర్సీతో టీమిండియా



భారత హాకీ జట్టు జెర్సీ రంగు మార్పుపై దుమారం రేపిన విషయం తెలిసిందే. ఎఫ్ఐహెచ్ హాకీ వరల్డ్‌కప్ ముందు నీలం రంగు స్థానంలో కాషాయంను ప్రవేశపెట్టడంపై విమర్శలు రాగా.. ఆ టోర్నీలో అదే జెర్సీతో ఆడిన టీమిండియా నిరాశపరిచింది. దాంతో.. రాబోయే టోర్నమెంట్లలో మునపటి బ్లూ కలర్‌నే కొనసాగించాలని భారత జట్టు నిర్ణయించుకుందని సమాచారం. త్వరలో జరుగనున్న 20వ ఆసియా క్రీడల్లో హర్మన్‌ప్రీత్ సింగ్, సలీమా టెటె సారథ్యంలోని జట్లు తమకు అచ్చొచ్చిన నీలంతోనే బరిలోకి దిగనుందని హాకీ ఇండియా వర్గాలు చెబుతున్నాయి. భారత హాకీలో కాషాయం కథ ముగిసింది. ఆగస్టులో జరిగిన ఎఫ్ఐహెచ్ పురుషుల, మహిళల హాకీ వరల్డ్‌కప్‌లో ఆరెంజ్ జెర్సీతో ఆడిన టీమిండియా.. ఈసారి సంప్రదాయ నీలం రంగుకే ఓటేయనుంది. జపాన్ ఆతిథ్యమిస్తున్న ఆసియా క్రీడల్లో నీలం రంగు జెర్సీతోనే భారత పురుషుల, మహిళల జట్లు బరిలోకి దిగనున్నాయని సమాచారం. ఈ మెగా ఈవెంట్‌లో తొలి ప్రధాన్య కిట్ రంగుగా నీలం ఉండనుందని హాకీ ఇండియా తెలిపింది. 'ఆసియా క్రీడల్లో భారత హాకీ జట్ల తొలి ప్రధాన్య కిట్‌గా దేన్ని ఎంచుకుంటారు? అని భారత ఒలింపిక్ సంఘం అడిగింది. అందుకు.. మేము నీలం అని చెప్పాం. రెండో ప్రధాన్య రంగుగా కాషాయాన్ని ఎంచుకున్నాం' అని స్పోర్ట్స్ స్టార్‌తో హాకీ ఇండియా మీడియా ప్రతినిధి శేఖర్ మనోహరన్ వెల్లడించాడు. సెప్టెంబర్ 18వ తేదీ నుంచి ఆసియా క్రీడలు మొదలవ్వనున్నాయి. అక్టోబర్ 2న మహిళల హాకీ ఫైనల్, అక్టోబర్ 3న పురుషుల హాకీ ఫైనల్ మ్యాచ్‌లు నిర్వహించనున్నారు.


స్పోర్ట్స్

అఫ్గనిస్థాన్‌తో టీ20లకు సుందర్ ఫిట్..
బుమ్రాపై నిర్ణయం ఆరోజే!



శ్రీలంక పర్యటనకు దూరమైన భారత క్రికెటర్ వాషింగ్టన్ సుందర్ ఫిట్‌నెస్ సాధించాడు. స్వదేశంలో అఫ్గనిస్థాన్‌తో జరుగనున్న టీ20 సిరీస్‌కు ఎంపికైన ఈ స్పిన్ ఆల్‌రౌండర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఫిట్‌నెస్ నిరూపించుకున్నాడు. దాంతో.. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో సుందర్ ఆడడం ఖాయమైంది. మరో నాలుగు రోజుల్లో తొలి మ్యాచ్ ఉన్నందున ప్రధాన పేసర్ జస్ప్రీత్ బుమ్రా ఆడడంపై సందేహాలు నెలకొన్నాయి. ఈ స్పీడ్‌స్టర్ ఫిట్‌నెస్‌పై సెప్టెంబర్ 9వ తేదీ బుధవారం నాడు నిర్ణయం వెలువడనుంది. అఫ్గనిస్థాన్‌తో టీ20 సిరీస్‌కు మరో నాలుగు రోజులే ఉంది. స్వదేశంలో జరుగుతున్న ఈ సిరీస్‌కు ఎంపికైన ఆటగాళ్ల ఫిట్‌నెస్ కోసం నిరీక్షిస్తున్న భారత జట్టుకు గుడ్‌న్యూస్. స్పిన్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ ఫిట్‌నెస్ నిరూపించుకున్నాడు. గాయంతో శ్రీలంక పర్యటనకు దూరమైన సుందర్ బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో నిర్వహించిన ఫిట్‌నెస్ పరీక్షలో గట్టెక్కాడు. అయితే.. ఇప్పటికీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లోనే ఉన్న జస్ప్రీత్ బుమ్రా, పేస్ ఆల్‌రౌండర్లు హర్షిత్ రానా, నితీశ్ కుమార్ రెడ్డిల ఫిట్‌నెస్‌పై స్పష్టత రాలేదు. ఈ ముగ్గురు ఫిట్‌గా ఉన్నారా? లేదా? అనే విషయంపై సెప్టెంబర్ 9న బీసీసీఐ ప్రకటన చేయనుంది. సెప్టెంబర్ 13వ తేదీన కాబూలీలో తొలి టీ20తో సిరీస్ మొదలవ్వనుంది.

భారత స్క్వాడ్: శ్రేయాస్ అయ్యర్(కెప్టెన్), అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, సంజూ శాంసన్(వికెట్ కీపర్), ఇషాన్ కిషన్(వికెట్ కీపర్), తిలక్ వర్మ(వైస్ కెప్టెన్), శివం దూబే, నితీశ్ రెడ్డి, అక్షర్ పటేల్, సుందర్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, బుమ్రా, అర్ష్‌దీప్, హర్షిత్ రానా.



బ్రిటిష్ కాలం నాటి సాహస యాత్ర
విజయ్ దేవరకొండ 'రణబాలి' టీజర్ అప్‌డేట్!

రౌడీ హీరో విజయ్ దేవరకొండ, ట్యాలెంటెడ్ డైరెక్టర్ రాహుల్ సంకృత్యాన్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అవేటెడ్ యాక్షన్ డ్రామా 'రణబాలి' సినిమాకు సంబంధించి మేకర్స్ ఒక క్రేజీ అప్‌డేట్‌ను ప్రకటించారు. సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చేలా రూపొందించిన ఈ చిత్ర టీజర్‌ను సెప్టెంబర్ 9వ తేదీ సాయంత్రం 4:05 నిమిషాలకు విడుదల చేయబోతున్నట్లు చిత్ర యూనిట్ సోషల్ మీడియా ద్వారా అధికారికంగా వెల్లడించింది. ది లెజెండ్ ఆఫ్ ది కర్సడ్ ల్యాండ్ రైజెస్ అనే క్యాప్షన్‌తో వస్తున్న ఈ అప్‌డేట్ ప్రస్తుతం నెట్టింట విశేషంగా వైరల్ అవుతోంది. 1854 నుంచి 1878 మధ్య బ్రిటిష్ కాలం నాటి వాస్తవిక చారిత్రక సంఘటనలు, అణచివేతకు వ్యతిరేకంగా సాగే పోరాటం నేపథ్యంలో ఈ సినిమాను అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నారు. ఈ పాన్-ఇండియా చిత్రంలో విజయ్ దేవరకొండ సరసన రష్మిక మందన్న నటిస్తుండగా, ప్రముఖ హాలీవుడ్ నటుడు ఆర్నాల్డ్ వోస్లూ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రానికి టి-సిరీస్ సమర్పిస్తుండగా, స్టార్ మ్యూజిక్ డైరెక్టర్స్ అజయ్-అతుల్ అద్భుతమైన సంగీతం అందిస్తున్నారు. ఈ భారీ పీరియడ్ డ్రామాను దసరా కానుకగా అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే ఖరారు చేశారు.

చిరంజీవి 'కాకా'లో అనస్వర రాజన్.. ఎంబీబీఎస్ స్టూడెంట్‌గా ఫస్ట్ లుక్ అదిరింది!



మలయాళం ఇండస్ట్రీలో తనదైన నటనతో గుర్తింపు తెచ్చుకున్న యువ కథానాయిక అనస్వర రాజన్ ఇప్పుడు తెలుగులో వరుస అవకాశాలతో బిజీగా మారుతోంది. ఇప్పటికే తెలుగు ప్రేక్షకులకు దగ్గరవుతున్న ఈ మలయాళీ బ్యూటీ.. తాజాగా మరో తెలుగు సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో టాలీవుడ్‌లో ఆమె జోరు మరింత పెరిగినట్లు కనిపిస్తోంది.ప్రస్తుతం అనస్వర రాజన్ చేతిలో ఉన్న ప్రాజెక్టుల్లో 'కాకా' మాత్రం ఆమె కెరీర్‌లోనే అత్యంత కీలకమైన చిత్రంగా నిలవనుంది. మెగాస్టార్ చిరంజీవి ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న ఈ భారీ సినిమాలో అనస్వర ఓ కీలకమైన పాత్రలో కనిపించనుంది. ఈ సినిమాలో ఆమె పోషిస్తున్న పాత్రపై ఇప్పటికే ఆసక్తి నెలకొనగా.. తాజాగా ఆమె పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్ లుక్ మరింత క్యూరియాసిటీని పెంచింది. అనస్వర రాజన్ పుట్టినరోజు సందర్భంగా 'కాకా' చిత్రబృందం ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఇందులో అనస్వరను ఎంబీబీఎస్ విద్యార్థిని అమ్ములుగా పరిచయం చేశారు. చాలా సహజమైన, హోమ్లీ లుక్‌లో కనిపిస్తున్న ఆమె ఫస్ట్ లుక్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. సాధారణ గ్లామర్ లుక్‌కు భిన్నంగా.. ఓ మెడికల్ స్టూడెంట్‌గా అనస్వరను చూపించడం ప్రత్యేకంగా నిలిచింది. ఆమె పాత్ర సినిమాకు కథాపరంగా ఎంత ముఖ్యమో పోస్టర్‌లోనే హింట్ ఇచ్చినట్లు కనిపిస్తోంది. ముఖ్యంగా అనస్వర వెనుక భాగంలో నీడలా కనిపిస్తున్న చిరంజీవి పాత్ర.. ఈ సినిమాలో వీరిద్దరి మధ్య ఉన్న బంధంపై ఆసక్తిని పెంచుతోంది.'కాకా' సినిమాలో అనస్వర రాజన్ చిరంజీవి కూతురు 'అమ్ములు' పాత్రలో నటిస్తున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. తండ్రి-కూతుళ్ల అనుబంధం సినిమాకు కీలకమైన ఎమోషనల్ పాయింట్‌గా ఉండే అవకాశం ఉందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి.

యష్ 'టాక్సిక్'కు ఓటీటీ షాక్.. రూ.150 కోట్ల ఆఫర్ నుంచి రూ.30 కోట్లకు పడిపోయిందా?



కన్నడ రాకింగ్ స్టార్ యష్ హీరోగా తెరకెక్కిన పాన్ ఇండియా మూవీ 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్' భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. 'కేజీఎఫ్ 2' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత యష్ నటించిన సినిమా కావడంతో ఈ మూవీపై దేశవ్యాప్తంగా భారీ హైప్ ఏర్పడింది. అయితే థియేటర్లలో మాత్రం సినిమా ఆశించిన స్థాయిలో వసూళ్లు సాధించలేకపోయిందనే టాక్ వచ్చింది. ఇప్పుడు అదే ప్రభావం 'టాక్సిక్' డిజిటల్ రైట్స్‌పై పడినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. విడుదలకు ముందు భారీ మొత్తంలో ఓటీటీ సంస్థలు ఆఫర్లు ఇచ్చినప్పటికీ.. సినిమా ఫలితం తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయిందనే వార్తలు వినిపిస్తున్నాయి. 'టాక్సిక్'పై విడుదలకు ముందు ఉన్న క్రేజ్‌ను దృష్టిలో పెట్టుకుని ఓ ప్రముఖ ఓటీటీ సంస్థ డిజిటల్ స్ట్రీమింగ్ హక్కుల కోసం సుమారు రూ.150 కోట్ల ఆఫర్ చేసినట్లు సమాచారం. యష్ క్రేజ్‌తో పాటు సినిమాకు ఉన్న భారీ బజ్, టీజర్‌లో కనిపించిన బోల్డ్ కంటెంట్, స్టార్ హీరోయిన్ల గ్లామర్ వంటి అంశాలు ఈ ఆఫర్‌కు కారణమని అప్పట్లో ప్రచారం జరిగింది. అయితే ఆ సమయంలో ఈ ఆఫర్‌ను మేకర్స్ తిరస్కరించినట్లు తెలుస్తోంది. థియేటర్లలో సినిమా భారీ విజయం సాధిస్తే డిజిటల్ రైట్స్ విలువ మరింత పెరిగి రూ.200 కోట్ల వరకు వెళ్లే అవకాశం ఉందని భావించినట్లు టాక్. కానీ బాక్సాఫీస్ ఫలితం అంచనాలకు భిన్నంగా రావడంతో ఇప్పుడు లెక్కలు పూర్తిగా మారిపోయినట్లు తెలుస్తోంది. తాజాగా వినిపిస్తున్న సమాచారం ప్రకారం 'టాక్సిక్' డిజిటల్ స్ట్రీమింగ్ రైట్స్ కోసం జీ5 సుమారు రూ.30 కోట్ల ఆఫర్ ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. విడుదలకు ముందు వచ్చిన రూ.150 కోట్ల ఆఫర్‌తో పోలిస్తే ఇది చాలా తక్కువ మొత్తం. అంటే సినిమా విడుదలకు ముందు ఉన్న అంచనాలు, విడుదల తర్వాత వచ్చిన ఫలితం ఓటీటీ మార్కెట్‌పై ఎంత ప్రభావం చూపించాయో ఈ సంఖ్యలు చెబుతున్నాయని ట్రేడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే రూ.150 కోట్ల ఆఫర్, రూ.30 కోట్ల ప్రస్తుత ఆఫర్‌కు సంబంధించిన వివరాలపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. అందువల్ల ఇవి ప్రస్తుతం మీడియా, ట్రేడ్ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారంగానే చూడాల్సి ఉంటుంది. పాన్ ఇండియా సినిమాలకు థియేట్రికల్, ఓటీటీతో పాటు శాటిలైట్ రైట్స్ కూడా కీలక ఆదాయ వనరుగా ఉంటాయి. అయితే 'టాక్సిక్' విషయంలో 'ఊ' సర్టిఫికెట్ కంటెంట్ కారణంగా టెలివిజన్ ప్రసారానికి కొన్ని సమస్యలు ఎదురవుతున్నట్లు సమాచారం. టీవీలో ప్రసారం చేయాలంటే సినిమాలోని కొన్ని సన్నివేశాలను తొలగించి లేదా మార్చి కొత్త వెర్షన్‌ను సిద్ధం చేయాల్సి ఉంటుందని తెలుస్తోంది. అందుకే శాటిలైట్ హక్కుల కోసం ప్రత్యేకంగా ఎడిట్ చేసిన వెర్షన్‌ను రూపొందించే ఆలోచనలో మేకర్స్ ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అలాగే ఓటీటీ కోసం కూడా అవసరానికి అనుగుణంగా మరో వెర్షన్ సిద్ధం చేయాలనే ఆలోచన ఉన్నట్లు టాక్ వినిపిస్తోంది.



సెన్సార్ పూర్తి చేసుకున్న సుమంత్ 'మహేంద్రగిరి వారాహి'

వైవిధ్యమైన కథలతో ప్రేక్షకులను అలరించే హీరో సుమంత్ నటిస్తున్న తాజా చిత్రం 'మహేంద్రగిరి వారాహి' సంతోష్ జాగర్లపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా సెన్సార్ కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేసుకుంది. సెన్సార్ బోర్డు ఈ చిత్రానికి 'ఖ/ఊ' సర్టిఫికెట్‌ను జారీ చేసింది. ఈ చిత్రంలో సుమంత్ సరసన మీనాక్షి గోస్వామి, ఐశ్వర్య రాజేష్ మరియు మాళవికా నాయర్ నటిస్తుండగా, వెన్నెల కిషోర్ కీలక పాత్రలో కనిపించనున్నారు. అప్పారూబెన్స్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను రాగమయూరి ఎంటర్‌టైన్‌మెంట్స్ మరియు బ్రిడ్జ్ ఫిలిప్స్ బ్యానర్‌లపై మధు కాలిపు నిర్మిస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం సెప్టెంబర్ 11, 2026న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది.

PRINTED AND PUBLISHED BY MUPPIRISETTY JAGADEESH, On behalf of CATERWEALTH MEDIA LLP, PRINTED at M/S. SREE SESHASAI ENTERPRISES, D.NO. NEW. 3-88, OLD. 3-22, GOSALA, CHANDRA THEATER ROAD, PENAMALURU-521151, KRISHNA DISTRICT, ANDHRA PRADESH, PUBLISHED AT CATERWEALTH MEDIA LLP, 3RD FLOOR, 59-12-9A, FIRST LINE, GAYATHRI NAGAR, VIJAYAWADA, NTR DISTRICT, ANDHRA PRADESH. EDITOR: MUPPIRISETTY JAGADEESH. RNI REGD NO. APTEL/2016/70247, Email I D : mahanagarap@gmail.com Phone : 9044417999